RNI No.68319/98

# మెట్రో ఈవినింగ్స్

Estd. 1998

VOICE OF WORDS (English Daily)

హైదరాబాద్,శనివారం
అక్టోబర్ 10, 2026
పేజీలు : 8+4
సంపుటి: 29,సంచిక:105
వెల: రూ.6/-

Published from Hyderabad | ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్ | Metro Evenings Telugu Daily

## ఆడ బిడ్డలందరికీ సీఎం రేవంత్ బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): రాష్ట్రంలోని ఆడ బిడ్డలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు ఆడబిడ్డలందరూ ఆటపాటలతో అత్యంత వైభవంగా ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ ప్రత్యేకత అన్నారు.

### ఎంగిలి పూల బతుకమ్మతో శ్రీకారం

# నేటినుంచే బతుకమ్మ సంబురాలు





హైదరాబాద్ (మెట్రో న్యూస్): ప్రకృతి పూల పండుగ బతుకమ్మ పండుగ సంబురాలు శనివారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని కుంటలు, చెరువులు అన్నీ బతుకమ్మ పండుగకు ముస్తాబవుతున్నాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఇపుడు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో నిర్వహిస్తున్నారు. అధికారికంగా, అనధికారికంగా బతుకమ్మ సంబురాలు జరుగుతున్నాయి. ఈనెల 18న సద్దుల బతుకమ్మతో సంబురాలు ముగుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వమూ తగిన ఏర్పాట్లను చేపట్టింది. బతుకమ్మ అంటే మనకు పండుగ మాత్రమే కాదని.. మన బతుకుల్లోని బంధాలను, ఆప్యాయతలను, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే గొప్ప సంస్కృతీ సంప్రదాయమని మంత్రి సీతక్క ఈ సందర్భంగా ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిలో పూసే పూలను ప్రేమగా పేర్చి, బతుకమ్మను కొలుస్తూ ఆడిపాడే ఈ పండుగ తెలంగాణ ఆడబిడ్డల జీవితాల్లో ఎంతో ప్రత్యేకమైనదని ఆమె కొనియాడారు.





### జ్ఞానేశ్‌ను తొలగించాలని రాష్ట్రపతిని కలిసిన

# ఇండీ కూటమి నేతలు

ఇంటర్నెట్ డెస్క్: రాష్ట్రపతి ముర్ముతో 10 మంది ఇండీ కూటమి నేతలు భేటీ అయ్యారు. 3 ప్రధాన డిమాండ్లతో వినతిపత్రం సమర్పించారు. బృందంలో కాంగ్రెస్,టీఎంసీ, సీపీఐ, ఎన్సీ, సమాజ్వాదీ పార్టీ నేతలు ఖర్గే, రాహుల్, మమత, రాజా, సుప్రియా, ఒమర్ అబ్దుల్లా తదితరులున్నారు. సీఈసీని తొలగించాలని, సర్‌ను నిలిపివేయాలని, తొలగించిన ఓట్లను మళ్లీ చేర్చాలని కోరారు. అటు ప్రియాంక, డీకే శివకుమార్, కేసీ వేణుగోపాల్, మహువా తదితరులు విజయ్ చౌక్ వద్ద ధర్నా చేపట్టారు.

### మోదీ హయాంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది.. మల్లికార్జున ఖర్గే

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కార్, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీరుపై ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఈరోజు (శుక్రవారం) ఖర్గే ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. సీఈసీ తీరుతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని హెచ్చరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఇండియా కూటమి నేతలతో కలిసి కలుస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ చేస్తున్న తప్పులను రాష్ట్రపతికి వివరిస్తామని పేర్కొన్నారు.సీఈసీకి వ్యతిరేకంగా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని రాష్ట్రపతికి తెలిపామని మల్లికార్జున ఖర్గే అన్నారు. ఓటు చోరీ, ఈవీఎంల ద్వారా తప్పు జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఈ సమస్యలను అనేక సంవత్సరాలుగా కేంద్ర ఎన్నికల సంఘం ముందుంచామని వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజలకు ఓటు హక్కు లభించిందని ప్రస్తావించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చిన్న చేప అని.. ఆయన వెనుక బీజేపీ సర్కార్ ఉందని ఆరోపించారు.

# పాపం.. ట్రంప్‌కు ఈసారీ 'శాంతి' లేదు!



ఇంటర్నెట్ డెస్క్: గతేడాది నోబెల్ శాంతి బహుమతి ఆశించి భంగపడిన యూఎస్ అధ్యక్షుడు ట్రంప్‌కు ఈసారీ చుక్కెదురైంది. ఆయనను నామినేట్ చేసిన పాక్‌కూ ఇది ఎదురుదెబ్బే. ఆపరేషన్ సిందూర్ తో పాటు ఎన్నో యుద్ధాలు ఆపానని ప్రచారం చేసుకున్నా ఫలితం లేకపోయింది. మాటలకు, చేతలకు పొంతన లేకపోవడంతో ఆయన పేరును పక్కనపెట్టినట్లు తెలుస్తోంది. గతేడాది అవార్డు రాకపోవడంతో నార్వేజియన్ నోబెల్ కమిటీపై చిందులు తొక్కిన ట్రంప్ ఈసారి ఏం చేస్తారో వేచి చూడాలి.



# సీజేపి ప్రొటెస్ట్.. ఢిల్లీలో లాక్ డౌన్!

ఢిల్లీ (మెట్రోన్యూస్): సీజేపి ప్రొటెస్ట్ నేపథ్యంలో ఢిల్లీలో రేపు పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. మార్కెట్లు, దుకాణాలను మూసివేయాలని ఇప్పటికే సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, తమకు సహకరించాలని కోరారు. సెంట్రల్ ఢిల్లీలో ఈరోజు రాత్రి.10గంటల నుంచి రేపు రాత్రి 10 గంటల వరకు ఇంటర్నెట్ సేవలు నిలిపివేయనున్నారు. ప్రధాన రోడ్లపై బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా లాక్డౌన్ తరహా పరిస్థితులు నెలకొననున్నాయి.

# ఎల్‌నినో ఎఫెక్ట్




12న

హైదరాబాద్ (మెట్రో న్యూస్):రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్నాయి. కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిల పక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ఇందులో చర్చించే అవకాశముంది.

# లెక్క తేలుస్తాం

### ఎర్రవల్లిలో భూముల రీ సర్వే పర్యవేక్షణకు ప్రత్యేక డాష్ బోర్డు



హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఎర్రవల్లిలో 385 ఎకరాలలో 45 ఎకరాలు తక్కువ ఉందని, అందుకే సర్వే కోసం మరొక సారి నోటీసులు ఇవ్వడం జరిగిందని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎర్రవల్లిలో అసైన్డ్ భూములు కొన్ని చేతులు మారాయి వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం మీడియాతో చిట్ చాట్ చేసిన మంత్రి... నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ ల్యాండ్ ఉంటే వాటిని పేదలకు పంచుతామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అమరవీరులను గుర్తించి వాళ్లకు న్యాయం చేస్తామన్నారు. భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర రీ-సర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. రీ-సర్వేను రాష్ట్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నినసర్వే పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అధికారులతో భూ సర్వే పురోగతిపై మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సర్వేలో వేగం, నాణ్యతతో పాటు ప్రతి దశలో నిరంతర పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన ఆర్టీసీ పోలింగ్

హైదరాబాద్ (మెట్రోన్యూస్): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు సంఘం ఎన్నికలు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది ఉదయం నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది రాష్ట్రవ్యాప్తంగా 95 పోలింగ్ నమోదయింది గతంలో 2016లో నిర్వహించిన ఎన్నికల కంటే ఈసారి ఉత్సాహంగా కార్మికులు ఓటేశారు గ్రేటర్ హైదరాబాద్ జోన్లో 99 పోలింగ్ నమోదయింది అదేవిధంగా కరీంనగర్ జోన్ లో 97 ఓట్లు పోలయ్యాయి ఆర్టీసీ ఎన్నికల్లో మొత్తం సుమారు 35 వేల ఓట్లు పోలైనట్టు అధికారులు వెల్లడించారు

# బస్టాండ్లలో దసరా రద్దీ



హైదరాబాద్ (మెట్రో న్యూస్): తెలంగాణలో పాఠశాలలకు (శనివారం) దసరా సెలవులు కావడంతో హైదరాబాద్లోని వివిధ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లకు ప్రయాణికులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. సొంతూళ్లకు భారీగా తరలి వెళ్తున్నారు. వరుస సెలవుల నేపథ్యంలో ఇవాల్టి నుంచి ఈ నెల 18 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ 7000 ప్రత్యేక బస్సులను నడిపేందుకు సిద్ధమైంది. ఎప్పటి లాగే మహాలక్ష్మి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. మరోవైపు ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ప్రయాణికుల తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది.

Follow Us / @metroevenings.com

# బతుకమ్మ విశిష్టతను విశ్వవ్యాప్తం చేస్తాం: మంత్రి జూపల్లి

- 10 నుంచి 18 వరకు తొమ్మిది రోజుల పాటు వేడుకలు
- బతుకమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి
- రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు




**హైదరాబాద్ : మెట్రో న్యూస్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యానికి, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ విశిష్టతను విశ్వవ్యాప్తంగా చాటేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ నెల 10 నుంచి 18 వరకు తొమ్మిది రోజులపాటు బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హైటెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు.బతుకమ్మ తెలంగాణకే ప్రత్యేకమైన పండుగ అని జూపల్లి కృష్ణారావు అన్నారు. బతుకునే తల్లిగా భావించే తెలంగాణ ప్రజల జీవన సంస్కృతికి బతుకమ్మ నిలువుటద్దమని పేర్కొన్నారు. ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల పూలను దేవతగా కొలుస్తూ, పూజించే అపురూపమైన సంప్రదాయం ఈ పండుగ ప్రత్యేకత అని వివరించారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధనను ప్రతిబింబించేలా సంబరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలోనూ బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటే ఇలాంటి పండుగలను విస్తృతంగా నిర్వహించడం ద్వారా రాష్ట్ర సంప్రదాయాలను భావి తరాలకు అందించడంతోపాటు, ప్రపంచానికి తెలంగాణ ప్రత్యేకతను పరిచయం చేయవచ్చని పేర్కొన్నారు.తెలంగాణ ఆడబిడ్డలందరికీ మంత్రి జూపల్లి కృష్ణారావు.. బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయలకు ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆడపడుచులందరూ కలిసి సంతోషంగా చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరి, డైరెక్టర్ ఆఫ్ టూరిజం లక్ష్మణ్ రంజిత్ నాయక్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై దుష్ప్రచారాలు మానుకోవాలి...లేకుంటే తగిన విదంగా బుద్ధి చెప్తాం

- యాచారం మండలం కాంగ్రెస్ నాయకులు,మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్ ..



**మెట్రోన్యూస్,యాచారం:**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బస్సులో ప్రయాణిస్తూ ప్రజలతో మాట్లాడిన దృశ్యాలను కొంతమంది వక్రీకరించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్ ఆరోపించారు.అక్టోబర్ 6న కలెక్టరేట్ కార్యక్రమం అనంతరం బొంగ్లూర్ గేటు వద్ద ప్రయాణికుల కష్టసుఖాలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే ఆర్టీసీ బస్సులో ప్రయాణించారని తెలిపారు. మీరు ఏదైనా అభివృద్ధి గురించి మాట్లాడాలి ప్రజలకు ఉపయోగం జరిగేలా మాట్లాడాలి అంతే గాని ఏలాంటి మచ్చలేని మా నాయకుని పైన దురుప్రచారం చేస్తే ఊరుకునేది లేదు నియోజకవర్గం లో కూడా తిరుగకుండా ప్రజలే మీకు బుద్ధి చెప్తారు అని గజ్జి రామకృష్ణ యాదవ్ బిఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు.

## జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతాయి: ఎంపీ చామల



**ఢిల్లీ : మెట్రో న్యూస్ :** దేశంలో జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతాయని భువనగిరి పార్లమెంట్ సభ్యులు మీడియా కమిటీ చైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు తమకు అనుకూలంగా లేని ఓట్లను తొలగించాలని ప్రధాని మోడీ హోం మంత్రి అమిత్యాలు కుట్ర పన్నుతున్నారని ఆయన తెలిపారు గతంలో ప్రధానంగా ఉన్న నెహ్రూ ఇందిరా గాంధీ రాజీవ్ గాంధీ పీవీ నరసింహారావు వాజ్పేయి మన్మోహన్ సింగ్ లు ఎన్నడు ఎన్నికల కమిషన్ను నిర్వీర్యం చేయలేదని చామల పేర్కొన్నారు. తెలంగాణలో అత్యధికంగా 27. 8 శాతం ఓట్లను తొలగించారని ఆయన వివరించారు గుజరాత్ మోడల్ అంటే 50 ఏళ్లు అధికారంలో ఉండడమేనా అని ఆయన ప్రశ్నించారు పంచాయితీ నుంచి పార్లమెంట్ వరకు మోడీ అమిత్యాలు 50 ఏళ్లు అధికారంలో ఉండాలని కలలు కంటున్నారని ఆయన పేర్కొన్నారు రెండు ఓట్లతో ఎన్నికల కమిషనర్ను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని ఇది పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమని శ్యామల పేర్కొన్నారు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ను తప్పించి ప్రధానమంత్రి కేంద్ర హోంశాఖ మంత్రి లోక్సభ ప్రధాన ప్రతిపక్ష నేతలను సభ్యులుగా పెట్టారని తెలిపారు దేశంలో ఎన్నికల కమిషన్ అనేది స్వతంత్ర ప్రతిపత్తి వ్యవస్థ అని చామల తెలిపారు పేపర్ లీకేజీ పై మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భర్త రఫ్ చేయాలని రాము డిమాండ్ చేసిన కాపాడే ప్రయత్నం మోడీ షాలు ఆయన తెలిపారు ఇండియా కూటమి నేతలకు రాష్ట్రపతిని కలిసే అవకాశం ఇవ్వాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# కేబీఆర్ పార్క్ పరిసరాల్లో వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్:మెట్రో న్యూస్ :** కేబీఆర్ పార్క్ పరిసరాల్లో అమలు చేస్తున్న వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా పరిశీలించారు. వన్‌వే అమలవుతున్న పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ పరిస్థితులు, జంక్షన్ల వద్ద రద్దీని పరిశీలించి అధికారులతో సమీక్షించారు.గతంలో కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు, ఇతర గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. అయితే, కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్ విధానం అమలుతో ఏర్పడిన పరిస్థితులు, ప్రజల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని గతంలో ప్రతిపాదించిన నిర్మాణ ప్రణాళికలను పునఃసమీక్షించి వన్‌వే విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జీహెచ్ఎంసీ చేపడుతున్న చర్యలను అధికారులు వివరించారు. గతంలో చెట్ల తొలగింపునకు సంబంధించిన అనుమతులపై న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని ప్రాజెక్టు రూపకల్పనను పునఃసమీక్షించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు విడివిడిగా నిర్మించే అండర్‌పాస్‌లు, గ్రేడ్ సెపరేటర్లకు బదులుగా సమగ్ర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ ప్రణాళిక రూపొందించింది. ముఖ్యంగా ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి కేబీఆర్ పార్క్ ప్రవేశ మార్గం వరకు అధికంగా ఉంటున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిరంతరాయంగా వాహనాలు ప్రయాణించేలా ఈ కారిడార్‌ను రూపొందించనున్నారు.ఈ ప్రాజెక్టును ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో రెండు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. ఆధునిక స్టీల్ నిర్మాణ సాంకేతికతను వినియోగించడం ద్వారా నిర్మాణ సమయాన్ని తగ్గించి, ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



# సీఈసీ తప్పిదంపై బీఆర్ఎస్ స్పందన శూన్యం




- పీసీసి చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్ : మెట్రో న్యూస్ :** సర్ విషయంలో సీఈసీ తప్పిదంపై టిఆర్ఎస్ స్పందన శూన్యమని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు సర్ ప్రక్రియ మీద దేశవ్యాప్తంగా బిజెపితో పాటు దాని మిత్రపక్షాలు మినహా అన్ని పార్టీలు రోడ్డెక్కాయని ఆయన తెలిపారు. ప్రధాని మోడీ హోం మంత్రి అమిత్ షా ల రాజకీయ తీరుపై పోరాటం చేస్తుంటే తెలంగాణలో టిఆర్ఎస్ పాత్ర ఎక్కడ అని ఆయన ప్రశ్నించారు తెలంగాణలో టిఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందని వాస్తవాలు వెల్లడించాలని సీఈసీ తప్పిదం చేస్తుంటే టిఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్ హరీష్ రావు ఫామ్ హౌస్‌లో ఉన్న కేసీఆర్‌లు ఎందుకు మాట్లాడడం లేదని మహేష్ గౌడ్ అన్నారు సీసీకి వ్యతిరేకంగా మాట్లాడకపోగా కనీసం నిరసన కార్యక్రమం కూడా చేయలేదని ఆయన అన్నారు తాము మొదటి నుంచి చెప్తున్నట్టుగా బిజెపితో టిఆర్ఎస్ లోపాయ కారీ ఒప్పందం మరో సారి ఈ ఘటన ద్వారా రుజువైందని మహేష్ గౌడ్ తెలిపారు టిఆర్ఎస్ పార్టీ సర్ విషయంలో ఉలుకు పలుకు లేకుండా ఉండడానికి అనేక కారణాలు ఉన్నాయని ఆయన తెలిపారు తమ ప్రభుత్వ పదేళ్ల హయాంలో చేసిన అవినీతి బయటకు తీస్తారని జైల్లో వేస్తారని భయంతో టిఆర్ఎస్ నేతలు మౌనంగా ఉంటున్నారని మహేష్ గౌడ్ తెలిపారు కాళేశ్వరం ఈ ఫార్ములా కేస్ ఉదాహరణలని ఆయన వివరించారు. సర్ విషయంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని తమ పార్టీ చేస్తున్న వాదనకు బలం చేకూర్చేలా ముషీరాబాద్ ఘటన ఒక ప్రత్యక్ష నిదర్శనం అని మహేష్ గౌడ్ తెలిపారు

సర్‌లో ముఖ్యంగా దళితుల మైనార్టీల గిరిజనుల ఓట్లు తొలగిస్తున్నారని తెలిపారు.వెస్ట్ బెంగాల్‌లో రోహింగ్యల పేరుతో మమత బెనర్జీ గెలవకుండా ఆపారని బీహార్‌లో ఆర్జె డీ గెలవకుండా ఆపారన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లు సర్ అక్రమాలకూ వ్యతిరేఖంగా పోరాటం చేస్తున్నారన్నారు.ఉండటానికి ఇల్లు లేదన్న కేటిఆర్ కు ఫైవ్ స్టార్ హోటల్స్ ఉన్నాయని ఇన్ని వేల కోట్ల ఆస్తులు ఏక్కడివి అని ప్రజలు అడుగుతున్నారని తెలిపారు బండారం బయట పడుతుందని టిఆర్ఎస్ నాయకులు నాయకులు సర్ పై మాట్లాడట్లేదన్నారు.బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ, పంజాబ్ లని అందు వల్లనే రాష్ట్రంలో దురుద్దేశ పూర్వకంగా సర్ ప్రక్రియ జరుగుతుందని ఆయన వివరించారు .ప్రజా క్షేత్రంలో నిరసనలు తెలపడం తప్పు కాదన్నారు.బీజేపీ, కిషన్ రెడ్డితో బలమైన లోపాయి కార ఒప్పందం తో బీఆర్ఎస్ సర్‌పై మాట్లాడట్లేదనేది మాకు అనుమానం ఉందన్నారు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలపై ప్రశ్నించే ఏ పార్టీ కైనా కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందని మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు.

## కాన్షీరాంకు భారత రత్న ఇవ్వాలి

- ఆయన స్ఫూర్తితో సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత




**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** అణగారిన వర్గాలకు రాజ కీయ అధికారం కావాలన్న అంబేద్కర్ ఆశయాలను ఆచరణ లో చూపిన మహనీయుడు కాన్షీరాం అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆయన వర్ధంతి సం దర్భంగా శుక్రవారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాల యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాన్షీరాం కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన స్ఫూర్తితో సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తామని చెప్పారు. అణగారిన వర్గాలకు నిజమైన రాజకీయ ప్రాతి నిధ్యం కల్పించడమే ఆ మహనీయునికి మనమిచ్చే ఘన మైన నివాళి అని చెప్పారు. రాబోయే రోజుల్లో కచ్చితంగా అణగారిన వర్గాలను అసెంబ్లీకి తీసుకెళ్లి తీరుతామన్నారు. తెలంగాణ రక్షణ సేన సామాజిక న్యాయ సంకల్పానికి కాన్షీరామే స్ఫూర్తి అని చెప్పారు.

పార్టీ ప్రధాన సిద్ధాంతమైన పాంచజన్యాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కవిత పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ప్రజలకు ఏ సమస్య ఉన్నా పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి అండగా నిలవాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాలో రైతులను దోపిడీ చేస్తున్న దళారులను పార్టీ నాయకత్వం ప్రశ్నిస్తే ఇప్పుడు అన్ని పార్టీలు రైతులకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రతి నాయకుడు నిత్యం ప్రజల మధ్యే ఉంటూ పార్టీ బలోపే తానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ ఏడాది పొడ వునా చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని.. వాటిపై ఎక్కడికక్కడ ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. ప్రధాన రాజకీయ పార్టీల తో మనం తలపడాల్సి ఉంటుందని.. అందుకు పార్టీ నాయకత్వం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## భారీ పెట్టుబడులే లక్ష్యంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'

- పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టండి
- పారిశ్రామికవేత్తలకు మంత్రి జూపల్లి ఆహ్వానం

**హైదరాబాద్: మెట్రో న్యూస్ :** తెలంగాణ పర్యాటక రంగాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింతగా ప్రోత్సహించేందుకు ట్రావెల్ టూరిజం ఫెయిర్ వంటి వేదికలు దోహదపడతాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటక సంస్థలు, ట్రావెల్ కంపెనీలు, ఆతిథ్య రంగ సంస్థలు, పర్యాటక పరిశ్రమ ప్రతినిధులు ఒకే వేదికపైకి రావడం ద్వారా కొత్త వ్యాపార అవకాశాలు, భాగస్వామ్యాలు, ఉపాధి మార్గాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన 24వ ట్రావెల్ టూరిజం ఫెయిర్-2026కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ప్రదర్శనలో 16 రాష్ట్రాలు, 7 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.... ఈ ప్రదర్శన ద్వారా దేశీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ కొనుగోలుదారులు, సేవలందించే సంస్థల మధ్య అనుసంధానం పెరిగి, కొత్త భాగస్వామ్యాలు, మార్కెట్ విస్తరణకు అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ట్రావెల్ ఇండస్ట్రీ కూడా కొత్త ప్యాకేజీలను ప్రకటించి, పర్యాటకులు తెలంగాణకు వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు నాసిర్ అస్లాం వానీ, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరి, డైరెక్టర్ ఆఫ్ టూరిజం లక్ష్మణ్ రంజిత్ నాయక్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి,ఫెయిర్ ఫెస్ట్ ఎండీ ఇంబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో నేపథ్యంలో ఉద్యాన పంటల సాగుకు మరింత ప్రోత్సాహం

- అధికారులతో సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్: మెట్రో న్యూస్ :** ఎల్‌నినో నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ, ఉద్యాన పంటల సాగుకు మరింత ప్రోత్సాహం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో ఉద్యాన శాఖ, ఆయిల్ ఫెడ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలో ఉద్యాన పంటల పథకాల అమలు, ఆయిల్ పామ్ సాగు పురోగతి తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు.రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుండటం సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. గతంతో పోలిస్తే స్పైసెస్ సాగు 65 శాతం, ఎర్రమిరప సాగు 83 శాతం, ఇతర సుగంధ ద్రవ్యాల సాగు 192 శాతం, పూల సాగు 198 శాతం పెరిగినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఉద్యాన పంటల సాగులో నమోదవుతున్న ఈ పురోగతిని కొనసాగించడంతో పాటు మరింతవిస్తరించేందుకుఅవసరమైనచర్యలుతీసుకోవాలనిమంత్రి ఆదేశించారు.

కూరగాయల సాగును పెంచాలి.. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకోవాలి రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని కూడా గణనీయంగా పెంచాలని మంత్రి సూచించారు. కూరగాయల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని, ఉత్పత్తి పెంపుతో పాటు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచాలని ఆదేశించారు. తెలంగాణలో పండించిన కూరగాయలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రం ఎదగాలని, ఆ దిశగా ఉద్యాన శాఖ అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు అనుకూలత ఉందని, కనీసం 10 లక్షల ఎకరాల్లోనైనా సాగు జరిగేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతి సంవత్సరం 2 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టే లక్ష్యంతో అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.వ్యవసాయ మరియు ఉద్యానశాఖలో అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని వేరువేరుగా కాకుండా ఏకీకృత నోడల్ ఏజెన్సీ ద్వారా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవాలని మంత్రి ఆదేశించారు. ఆయిల్ ఫెడ్‌లో ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి, అక్టోబర్ నెలాఖరులోగా నియామకాలకు సంబంధించిన ప్రాథమిక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. తదుపరి రెండు, మూడు నెలల్లో నియామక ప్రక్రియను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కృషితోనాస్తి దుర్భిక్షం

మెట్రో ఈవినింగ్స్

3, హైదరాబాద్ శనివారం అక్టోబర్ 10, 2026

# డీలిమిటేషన్ బిల్లు కోల్డ్ స్టోరేజ్ కేనా ?

## //ఎడిటోరియల్//

దేశంలో అనూహ్యమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెల వరకూ కమలం పార్టీ ఫుల్ జోష్ లో ఉంది. అందుకే ఏప్రిల్ నెల 16 17 తేదీలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించి మరీ డీలిమిటేషన్ బిల్లుని ఆమోదించు కోఅవడానికి చూసింది. అయితే అక్కడే కథ అడ్డం తిరిగింది. ఇండియా కూటమి పార్టీలతో పాటు ఇతర విపక్షాలు అన్నీ ఐక్యంగా నిలబడడంతో ఎన్డీయే 298 ఓట్లకే పరిమితమై బిల్లు వీగిపోయింది. మొత్తం లోక్ సభ ఎంపీలలో సభకు హాజరైన వారి నుంచి మూడింట రెండు వంతుల సభ్యుల మద్దతు డీలిమిటేషన్ వంటి రాజ్యాంగ సవరణ బిల్లులకు అవసరం అవుతుంది. అయితే సరిపడా మద్దతు లేకపోవడంతో బీజేపీ మరో కొత్త వ్యూహానికి తెర తీసింది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో అధికారాన్ని హస్తగతం చేసుకున్న బీజేపీ అక్కడ బలంగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీని అడ్డంగా చీల్చింది. అందులో నుంచి 20 మంది ఎంపీలను ప్రత్యేక వర్గంగా జట్టు కట్టించింది. అలాగే ఏక్ నాథ్ షిండే నాయకత్వంలోని ఎన్ సీపీలోకి ఉద్ధవ్ థాక్రే నాయకత్వంలోని ఎన్సీపీకి చెందిన ఆరుగురు ఎంపీలను చీల్చి మరింతగా ఎన్ డీయే బలాన్ని పెంచుకుంది. ఇక ఇండియా కూటమికి దూరం అయిన డీఎంకేని కూడా పరోక్షంగా దువ్వే ప్రయత్నం చేసింది. ఇంకా వీలైతే మరిన్ని పార్టీలను కలుపుకుని డీలిమిటేషన్ బిల్లుకి సరిపడా 362 సభ్యుల మద్దతు దక్కించుకోవాలని బీజేపీ తన వంతు తీవ్రంగానే కసరత్తుని చేస్తూ వచ్చింది. తెరవెనుక నడుస్తున్న వ్యూహాత్మక రాజకీయాల వెనుక అసలు నిజాలేంటి?

ఇక వర్షాకాల సమావేశాలలోనే డీలిమిటేషన్ బిల్లుకు ఆమోద ముద్ర వేయించుకోవాలని బీజేపీ వేసిన రాజకీయ వ్యూహానికి అంతే తెలివిగా ఇండియా కూటమి చెక్ పెట్టేసింది. ఒక్క రోజు కూడా వర్షాకాల సమావేశాలు జరగకుండా కాంగ్రెస్ ఆటంకపరుస్తూ వచ్చింది. బయట జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసనలు అట్టుడికి పార్లమెంట్ ని స్థంభింపచేశాయి. ఈ క్రమంలో రాజకీయ అలజడిలో వర్షాకాల సమావేశాలు మొత్తం కరిగిపోయాయి. అయినా సరే డీలిమిటేషన్ ఆశలు అయితే బీజేపీలో ఇంకా సజీవంగా ఉన్నాయి. దానికి ఉదాహరణగా పార్లమెంట్ ని ప్రోరోగ్ చేయకపోవడం. ఎపుడైనా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి డీలిమిటేషన్ కి గ్రీన్ సిగ్నల్ తెచ్చుకోవాలని చూస్తున్న క్రమంలో ఇపుడు ఉరమని ఉరుములా మెరవని మెరుపులా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఇష్యూ తెర మీదకు వచ్చింది. దీంతో దేశంలో విపలు అన్నీ మళ్ళీ ఆందోళన బాట పట్టాయి. జాతీయ భద్రతకు సవాలా? తటస్థ పార్టీలు సైతం : అయితే విపల రాజకీయం ఎపుడూ ఇలాగే ఉంటుంది అని అనుకోవచ్చు. కానీ వైసీపీ బీజేడీ లాంటి తటస్థ పార్టీలు కూడా తమ ఫేస్ ని టర్నింగ్ ఇచ్చుకుంటున్నాయి. ఏప్రిల్ లో డీలిమిటేషన్ బిల్లుకు లోక్ సభలో వైసీపీకి చెందిన నలుగురు ఎంపీలు మద్దతు ఇచ్చారు. అందువల్లనే 298 ఓట్లు పడ్డాయి. ఇపుడు వైసీపీ కూడా ఈసీ తీరు మీద మండిపడుతోంది. ఏపీలో తమకు 2024 ఎన్నికల్లో అన్యాయం జరిగింది అని ఆ పార్టీ నేతలు అంటున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ డీలిమిటేషన్ బిల్లిని ఈసారి సభకు తెచ్చినా వైసీపీ వంటి పార్టీల మద్దతు ఉంటుందా అన్నది ఇపుడు చర్చగా ఉంది. అంతే కాదు ఇతర పార్టీలు కూడా పునరాలోచనలో పడుతున్నాయని అంటున్నారు. డీఎంకే అయితే డీలిమిటేషన్ బిల్లుకి వ్యతిరేకమే అంటోంది. ఈ నేపథ్యం నుంచి చూసినపుడు లోక్ సభ ఎంపీ సీట్లను పెంచుకునే డీలిమిటేషన్ బిల్లు కోల్డ్ స్టోరేజ్ కేనా అన్న చర్చ అయితే సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# పట్టుదలే పెట్టుబడి

మెట్రో డైలీ

జాలితో పువ్వును అడిగా..
నీ గొంతు కోసినపుడు బాధ కాలేదా అని !
త్యాగమయి పువ్వు జవాబు చెప్పింది..
కోసిన వారి ముఖంలో విరబూసిన..
సంతోషాన్ని చూసి నా బాధను మరిచా అని !
దారి వెంట ముళ్లు ఉన్నా..
ప్రయాణం జాగ్రత్తగా సాఫీగా సాగనీ..
గమ్యం బహు దూరంగా ఉన్నా..
పట్టుదలను ఎన్నడూ సడలనివ్వకు
పట్టుదలే కదా నీ గెలుపును పెట్టుబడి !
శవానికి స్నానం చేయించి..
దహన సంస్కారాలు చేసి..
స్నానం చేసి వస్తారు నీ వాళ్లు
ఈ రెండు స్నానాలు నడుమ..
జీవితాలు సాగి ఆగిపోతున్నాయి !
సంపన్నుల వద్ద ధనం ఉంది
పేదవాడి వద్ద ఆశల కుప్ప ఉంది
ఒకరు కలల్ని కొంటానికి చూస్తారు
మరొకరు ఆశలను వదులుకోరు
విత్తం విలక్షణ ఆటలు ఆడిస్తుంది !
ఒంటరిగా వచ్చి బంధాలు పెంచుకున్నాం
ఒంటరిగా వెళుతూ వాటిని తెంచుకున్నాం
మనిషి జీవితం ఒంటరి ప్రయాణం
నీ సంపాదన పంచుకుంటారు సంతానం నీవు
పంచిన ప్రేమను గుర్తుంచుకుంటారు లోకులు

– మధుపాళీ, 9949700037

# బతుకమ్మ: తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయ పండుగ

## పూలను పేర్చి.. ప్రకృతిని కొలిచి.. బంధాలను బలపరిచే బతుకమ్మ పండుగ

## మెట్రో తెలంగాణ చావడి



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగల్లో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉంది. పూలను అందంగా పేర్చి బతుకమ్మను తయారు చేసి, ఆడపడుచులంతా ఒకచోట చేరి పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ జరుపుకునే ఈ పండుగలో ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధం ప్రతిబింబిస్తుంది. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం నేటి ఆధునిక జీవనశైలిలోనూ తన ప్రత్యేకతను కోల్పోకుండా కొనసాగుతోంది.నిబతుకమ్మ అంటేనే రంగురంగుల పూల సమాహారం. తంగేడు, గునుగు, బంతి, చామంతి, గుమ్మడి, మందారం తదితర పూలతో బతుకమ్మను అలంకరిస్తారు. ప్రకృతిలో లభించే పూలను సేకరించి, వాటిని గౌరవంగా పేర్చి బతుకమ్మగా మలచడం ఈ పండుగలోని ప్రత్యేకత. పూల సువాసన, రంగుల అందం, మహిళల సంప్రదాయ వస్త్రధా రణతో గ్రామాలు, పట్టణాలు పండుగ శోభను సంతరిం చుకుంటాయి. బతుకమ్మ చుట్టూ తిరుగుతూ మహిళలు పాడే జానపద గీతాల్లో తెలంగాణ పల్లె జీవనం, కుటుంబ బంధాలు, ప్రకృతి అందాలు, స్థానిక ఆచార వ్యవహారాలు కనిపిస్తాయి. తరతరాలుగా మౌఖికంగా కొనసాగుతున్న ఈ పాటలు తెలంగాణ జానపద సంస్కృతికి విలువైన సంపదగా నిలిచాయి. పెద్దల నుంచి చిన్నతరానికి ఈ పాటలు, ఆచారాలు అందడం బతు కమ్మ పండుగ ప్రత్యేకత. బతుకమ్మ పండుగ కేవలం పూలతో చేసే వేడుక మాత్రమే కాదు.. కుటుంబాలను, బంధు వులను, స్నేహితులను ఒక్కచోట చేర్చే ఆత్మీయ సందర్భం. వివాహిత మహిళలు పుట్టింటికి రావడం, బంధు మిత్రులతో కలిసి బతుకమ్మ ఆడటం తెలంగాణ కుటుంబ వ్యవస్థలోని అనుబంధాలకు అద్దం పడుతుంది. పల్లెల్లో మొదలైన ఈ సంప్రదాయం నేడు ప్రపం చంలోని వివిధ ప్రాంతాల్లోనూ తెలంగాణవారు కొనసాగి స్తున్నారు. బతుకమ్మలో మరో ముఖ్యమైన అంశం ప్రకృతి ఆరాధన. వర్షాకాలం ముగిసి చెరువులు, కుంటలు నీటితో కళకళలాడే






సమయంలో వివిధ రకాల అడవి, స్థానిక పూలు విరివిగా పూస్తాయి. వాటినే బతుకమ్మకు ఉపయోగించడం ద్వారా ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు స్థానిక వృక్షజాతులతో అనుబంధాన్ని కొనసాగించే సంప్రదాయం కనిపిస్తుంది.కాలం మారుతున్నా బతుకమ్మ పండుగలోని ఆత్మ మాత్రం మారడం లేదు. ఒకప్పుడు పల్లెల్లోని వాకిళ్లు, చెరువుల కట్టలు బతుకమ్మ వేడుకలకు వేదికలైతే.. ఇప్పుడు పట్టణాల్లోనూ భారీ స్థాయిలో వేడుకలు జరుగుతున్నాయి. విద్య ఉద్యోగాల కోసం వివిధ ప్రాంతా లకు వెళ్లిన తెలంగాణ ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో బతుకమ్మను నిర్వహిస్తూ సంస్కృతిని కొనసాగిస్తున్నారు. బతుకమ్మ అంటే పూలను పేర్చిన అందమైన రూపం మాత్రమే కాదు.. తెలంగాణ నేలతో, ప్రకృతితో, ఆడ పడుచుల ఆత్మీయతతో ముడిపడిన జీవన సంస్కృతి. తరాలు మారినా.. పూల పరిమళం మారినా.. బతుకమ్మ చుట్టూ వినిపించే పాటల్లో తెలంగాణ మట్టివాసన మాత్రం ఎప్పటికీ నిలిచే ఉంటుంది. బతుకమ్మ ను తొమ్మిది రోజుల పాటు వివిధ పేర్లతో పూజిస్తారు. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మగా, రెండో రోజు అటుకుల బతుకమ్మగా, మూడవ రోజు ముద్ద పప్పు బతుకమ్మగా, నాలుగవ రోజు నానబియ్యం బతుకమ్మ గా ఐదవ రోజు అట్ల బతుకమ్మగా, ఆరవరోజు అలిగిన బతుకమ్మగా, ఏడవ రోజు వేప కాయల బతుకమ్మగా, ఎనిమిదవ రోజు వెన్నెముద్దల బతుకమ్మగా, తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మగా పూజిస్తారు. తొమ్మిది రోజులు తొమ్మిది రకాల నైవేద్యాలను బతుకమ్మకు సమర్పించి, ఆటలాడిన తర్వాత అందరూ కలిసి పంచుకొని తింటారు. ఐకమత్యాన్ని పెంపొందించడం ఈ పండుగ ప్రత్యేకత.



– మానస
హైదరాబాద్

# మెట్రో ఇలవేల్పు

## నేడుమహాలయ శని అమావాస్య

దిష్టి దోషాలు, శని బాధలు ఇబ్బందిపెడుతున్నాయా? – ఈ పరిహారాలు పాటిస్తే ఉత్తమ ఫలితాలు!
– ఎంగిలిపూల బతుకమ్మ అనే పేరు ఎలా వచ్చిందో వివరిస్తున్న జ్యోతిష్యులు!

అక్టోబరు 10న శనివారంతో కూడిన ౹మహాలయ అమావాస్య౹ వచ్చింది. దీన్ని ౹శని అమావాస్య౹ అని కూడా పిలుస్తారు. అలాగే, ౹మహాలయ అమావాస్య౹ నాడు ఎంగిలిపూల బతుకమ్మ పేరుతో గౌరీదేవిని పూజిస్తారు. ఈ రోజు బతుకమ్మకు ఏ నైవేద్యం సమర్పించాలి? దీని ప్రాధాన్యత ఏంటి? శని అమావాస్య సందర్భంగా ఎలాంటి విధివిధానాలు పాటిస్తే సమస్త శుభఫలితాలు చేకూరుతాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం.

శనివారంతో కూడి వచ్చిన మహాలయ అమావాస్య చాలా శక్తివంతమైనదని చెబుతున్నారు అక్టోబరు 10న వచ్చిన ఇది ఎందుకు శక్తివంతమంటే, అమావాస్య శనేశ్వరుడు పుట్టిన తిథి, ఆయనకు ఇష్టమైన వారం. కాబట్టి, ఈ రోజు శని భగవానుడికి ఎంతో ప్రియమైనది. జాతక చక్రాల్లో శని దోషాలున్నా, శని మహాదశ నడుస్తున్నా అనేక సమస్యలు వస్తాయి. అవి పోగొట్టుకోవాలంటే శని అమావాస్య నాడు కొన్ని పరిహారాలు పాటిస్తే మంచి ఫలితం ఉంటుందంటున్నారు. అదేవిధంగా, రాశి పరంగా కూడా శని చాలా శక్తివంతుడు. ఏలినాటి శని, అష్టమ శని, సప్తమ శని ఇలా రకరకాలుగానూ పీడిస్తుంటాడు. ఆ పీడలు పోవాలన్నా ఈ రోజు కొన్ని విధివిధానాలు పాటిస్తే మంచిదంటున్నారు.

శని అమావాస్య రోజు ఏం చేయాలంటే?

కచ్చితంగా శనిదేవుడికి నువ్వుల నూనె, ఆవాల నూనెతో అభిషేకం చేసుకోవాలి.

అలాగే, ఈరోజు నవగ్రహాలకు ప్రదక్షిణలు చేస్తూ ౹ఓం శం శనైశ్వరాయ నమః౹ అని మనసులో స్మరించుకోవాలి. మీకు వీలైనన్ని ప్రదక్షిణలు నవగ్రహాల చుట్టూ చేయాలి.

అదేవిధంగా, హనుమాన్ చాలీసా చదివినా, విన్నా మంచిది. ఇందుకు సమయం లేనివారు సింధూరంతో ఆంజనేయుడిని పూజించడం ద్వారా కూడా భయంకరమైన శని దోషాల నుంచి బయటపడవచ్చంటున్నారు.అలాగే, ఈ రోజు రావి చెట్టు, జమ్మిచెట్టును పూజిస్తే అద్భుత ఫలితాలు కలుగుతాయి.మీకు దగ్గరలో రావి చెట్టు ఉంటే అక్కడ నువ్వుల నూనె దీపం వెలిగించి,

ఆ చెట్టుకు ఒక ఎనిమిది ప్రదక్షిణలు చేయండి. జమ్మిచెట్టు దగ్గర కూడా ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుందంటున్నారు.



దేవీ నవరాత్రుల్లో ఆదిశక్తి అమ్మవారికి తొమ్మిది రూపాలుగా నవ దుర్గా పూజ దర్శనమిస్తారు. నవదుర్గలను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే ధైర్యం, జ్ఞానం, శాంతి, శ్రేయస్సు కలుగుతుందని భక్తుల నమ్మకం.ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభం కానున్న దేవి నవరాత్రులు! శక్తి ఆరాధనకు శ్రేష్ఠమైన శరన్నవరాత్రులు! నవదుర్గలుగా తొమ్మిది రూపాల్లో

## శరన్నవరాత్రుల్లో 9 రూపాల్లో అమ్మవారు ఒక్కో రూపం వెనుక ఉన్న విశిష్టత

పూజలందుకునే ఆదిశక్తి! అభీష్ట సిద్ధిని కలిగించే నవదుర్గల ఆరాధన

నవదుర్గల విశిష్టత

దేవీ నవరాత్రుల్లో ఆది శక్తిని తొమ్మిది రూపాలుగా పూజించటం జరుగుతుంది ఇవే! ఈ స్వరూపాలే నవదుర్గలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ తొమ్మిది రూపాలను శ్రద్ధాభక్తులతో పూజిస్తే సకల విజయాలు, సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు చేకూరుతాయి. అసలు ఇంతకూ ఎవరీ నవదుర్గలు? ఆ స్వరూపాల విశిష్టత ఏమిటో తెలుసుకుందాం.

ప్రథమ రూపం – శైలపుత్రి విశిష్టత

పర్వతరాజైన హిమవంతుని కుమార్తె పార్వతి దేవిని శైలపుత్రి అంటారు. ఈ అమ్మ వారినే గిరిజ అని, హైమవతి అని కూడా పిలుస్తారు! ఈ తల్లి ఒక చేతిలో శూలం మరొక చేతిలో కమలధరించి ఉంటుంది! ఈమె వృషభాన్ని వాహనంగా కలిగి ఉంటుంది. కోరిన కోర్కెలు తీర్చగల తల్లి అయిన శైలపుత్రిని పూజిస్తే స్థైర్యం, ధైర్యం కలుగుతాయని విశ్వాసం.

ద్వితీయ రూపం– బ్రహ్మచారిణి విశిష్టత

ఆదిశక్తి ఈ స్వరూపం తపస్సును ఆచరించే రూపం. ఈ అమ్మ వారిని తపశ్చారిణి అని అంటారు! ఈ తల్లి తన కుడి చేతిలో జప మాల, ఎడమ చేతిలో కమండలంతో శ్వేత వస్త్రలను ధరించి ఉంటుంది! జ్ఞాన దాయిని, మెక్ష ప్రసాదిని అయిన బ్రహ్మచారిణి ఆరాధిస్తే జ్ఞానం, ఏకాగ్రత పెరుగుతాయని విశ్వాసం.

తృతీయ రూపం– చంద్రఘంట విశిష్టత

ఆదిశక్తి ఈ స్వరూపంలో దర్శనమిచ్చే జగదాంబ సింహ వాహిని. ఈ తల్లి ధనుస్సు, బాణం గద, శూలం, పాశం మొదలగు ఆయుధాలు, పద్మ కమండలం, అభయ, వరద హస్తాలతో పది చేతులలో కలిగి ఉంటుంది. నవరాత్రుల్లో జగదాంబను చంద్రఘంట స్వరూపంలో పూజిస్తే ఆ తల్లి దైర్యాన్ని వీరత్వాన్ని సకలాభిష్టాలను నెర వేరుస్తుందని విశ్వాసం.

చతుర్థ రూపం – కుష్మాండ స్వరూపం విశిష్టత

తన మందహాసంతో విశ్వాన్ని సృష్టించిన ఆదిశక్తి స్వరూపమే ఈ కూష్మాం! గుమ్మడి రూపంలో భూమండలాన్ని కల్పించిన తల్లి ఈ జగదాం! ఈ తల్లి తన అమృత హస్తాల్లో చక్రం, గద, ధనుస్సు, బాణం మొదలగు ఆయుధాలను, కమండలం, అమృత కలశం, జపమాల, పద్మంలను ధరించి ఉంటుంది. ఈ కుష్మాండ దేవి తనను ఆరాధించిన భక్తులకు ఆయురారోగ్యాలను ఐశ్వర్యాలను ప్రసాదిస్తుంది.

పంచమ రూపం – స్కంధమాత విశిష్టత

శరన్నవరాత్రుల్లో ఆదిశక్తిని స్కందమాత స్వరూపంలో కుమార స్వామి తల్లిగా, సింహవాహినిగా, అష్టభుజ దేవిగా ఆరాధిస్తారు! ఈ తల్లి తనను ఆశ్రయించిన భక్తులకు మోన్ని, జ్ఞానాన్ని, శాంతి సౌఖ్యాలను ప్రసాదిస్తుంది. ఈ మాతను కొలిస్తే సంతాన సౌభాగ్యం కలుగుతుంది.

# పాలను ఫ్రిజ్‌లో పెడితే.. పాటించాల్సిన చిట్కాలు



మన ఇళ్లల్లో దాదాపు పాలను వాడుతుంటారు. కొందరు టీ కోసం పాలను ఉపయోగిస్తే.. మరికొందరు పెరుగు, వెన్న, నెయ్యి కోసం పాలను ఉపయోగిస్తుంటారు. పచ్చి పాలను మరిగించిన తర్వాత చాలా మంది వాటిని రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేస్తుంటారు. అయితే, ఫ్రిజ్‌లో పెట్టిన పాలను ఎన్ని రోజుల్లోపు వాడాలంటే..మన రోజువారీ ఆహారంలో పాలు చాలా ముఖ్యమైన భాగం. చాలా మంది రోజు ఓ గ్లాస్ పాలు తాగుతుంటారు. ఇక, పిల్లలకు పాలు సంపూర్ణమైన, పోషక విలువలు కలిగిన ఆహారం. పాలతో టీ చేసుకుంటారు. పాలను సరైన పద్ధతిలో నిల్వ చేస్తే ఎక్కువ కాలం తాజాగా ఉంటాయి, కాస్త అజాగ్రత్తగా ఉన్నా అవి త్వరగా విరిగిపోతాయి. పాలను ఎన్ని రోజుల వరకు ఫ్రిజ్‌లో ఉంచవచ్చో తెలుసుకుందాం.

ఫ్రిజ్‌లో పాలు ఎన్ని రోజులు సురక్షితంగా ఉంటాయి?

పాల రకం, నిల్వ చేసే విధానంపై వాటి జీవితకాలం ఆధారపడి ఉంటుంది. పచ్చి పాలు: బాగా మరిగించి, చల్లార్చి ఫ్రిజ్‌లో పెడితే దాదాపు 2 నుంచి 3 రోజుల వరకు సురక్షితంగా ఉంటాయి.పాశ్చరైజ్డ్ పాలు: ప్యాకెట్ తెరిచిన తర్వాత సాధారణంగా 3 నుంచి 5 రోజుల వరకు ఫ్రిజ్‌లో నిల్వ ఉంచొచ్చు.యుహెచ్‌టి పాలు (టెట్రా ప్యాక్ మిల్క్): ప్యాక్ తెరవనంత వరకు గది ఉష్ణోగ్రత వద్దే కొన్ని నెలల పాటు నిల్వ ఉంటాయి. కానీ ఒక్కసారి ప్యాక్ తెరిచాక, ఫ్రిజ్‌లో పెట్టి 3 నుంచి 4 రోజుల్లోపు వాడేయాలి.

ఫ్రిజ్ డోర్‌లో పెట్టకండి: పాలను ఎప్పుడూ ఫ్రిజ్ డోర్ వైపు కాకుండా, లోపలి భాగంలో లేదా మధ్య అరల్లో ఉంచాలి. ఫ్రిజ్ తలుపు పదే పదే తీయడం వల్ల అక్కడ ఉష్ణోగ్రత మారుతూ ఉంటుంది, దాంతో పాలు త్వరగా పాడవుతాయి.

పాలు ఎక్కువ కాలం తాజాగా ఉండటానికి ముఖ్యమైన చిట్కాలు

పాలు మరిగించిన తర్వాత గది ఉష్ణోగ్రతకు చల్లారిన తర్వాతే ఫ్రిజ్‌లో పెట్టాలి. వేడి పాలను నేరుగా ఫ్రిజ్‌లో పెట్టకూడదు. పాలను ఎల్లప్పుడూ శుభ్రమైన, మూత ఉన్న గిన్నె లేదా బాటిల్‌లో మాత్రమే నిల్వ చేయాలి.మొత్తం పాలను మాటిమాటికీ ఫ్రిజ్ నుంచి బయటకు తీసి వేడి చేసి, మళ్లీ చల్లార్చి ఫ్రిజ్‌లో పెట్టడం మానుకోండి. పాలు ఎక్కువ మోతాదులో ఉంటే, చిన్న చిన్న భాగాలుగా విభజించి పెట్టుకోవడం మంచిది.ఫ్రిజ్ ఉష్ణోగ్రతను ఎల్లప్పుడూ 4 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే తక్కువగా ఉండేలా సెట్ చేయండి.



# మెరిసే చర్మం కోసం మునగాకు ఫేస్ ప్యాక్

మునగాకుతో చర్మం కాంతివంతం – సమృద్ధిగా యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలు, పోషకాలు

అందంగా కనిపించాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటాం. ఇంట్లో దొరికే సహజసిద్ధమైన పదార్థాల్నీ సౌందర్య పోషణ కోసం ఉపయోగిస్తాం. వీటిలో మునగ పొడి కూడా చేర్చుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఇది అందాన్ని ద్విగుణీకృతం చేయడంలో సమర్థంగా పని చేస్తుందని అంటున్నారు.

చర్మం కాంతివంతంగా : మునగాకులో యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలు, పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మ సంరక్షణకు, మొత్తం చర్మ ఆరోగ్యానికి ఎంతో తోడ్పడతాయి. సమతుల్య ఆహారంలో మునగాకును చేర్చుకోవడం వల్ల చర్మం మరింత ఆరోగ్యంగా, కాంతివంతంగా కనిపిస్తుంది. చర్మానికి తాజాదనాన్ని, నిగారింపును అందించడానికి మునగాకు పొడిని ఫేస్ ప్యాక్‌లా వాడుకోవచ్చు.

యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా : ఇందులో యాంటీ ఆక్సిడెంట్ కంటెంట్ అత్యంత ముఖ్యమైనది. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే ఆక్సిడేటివ్ ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటాయి. పర్యావరణ కాలుష్యం, యూవీ కిరణాలు, ఇతర బాహ్య కారకాల వల్ల ఆక్సిడేటివ్ ఒత్తిడి పెరుగుతుంది. ఇది కాలక్రమేణా చర్మం సహజ రూపాన్ని, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అందువల్ల, మునగాకులోని యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలు చర్మానికి రక్షణ కవచంలా పనిచేసి ఆరోగ్యంగా ఉంచడంలో తోడ్పడతాయి.వృద్ధాప్య ఛాయలను అరికట్టడంలో తోడ్పడుతుంది : ఆక్సిడేటివ్ ఒత్తిడి కారణంగా చర్మంపై ముడతలు రావడం, స్థితిస్థాపకతను కోల్పోవడం వంటి వృద్ధాప్య సంకేతాలు త్వరగా కనిపిస్తాయి. మునగాకులో ఉండే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను ఆక్సిడేటివ్ నష్టం నుంచి రక్షించడంలో సహాయపడతాయి. అయితే, చర్మ సంరక్షణలో రోజువారీ సన్‌స్క్రీన్ వాడకం, తగినంత నిద్ర, సమతుల్య ఆహారం వంటి ప్రాథమిక యాంటీ ఏజింగ్ పద్ధతులకు మునగాకు ప్రత్యామ్నాయం కాదని గమనించాలి. వాటితో పాటు దీనిని ఒక అదనపు పోషణగా ఉపయోగించవచ్చు.చర్మం హైడ్రేషన్‌ను కాపాడటం : మునగాకులో చర్మ ఆరోగ్యానికి తోడ్పడే వివిధ రకాల పోషకాలు, వృక్ష సమ్మేళనాలు ఉన్నాయి. కలబంద లేదా పెరుగు వంటి సహజ మాయిశ్చరైజింగ్ పదార్థాలతో మునగాకు పొడిను కలిపి ఫేస్ మాస్క్‌గా ఉపయోగించవచ్చు.



# అలోవెరా కొమ్మలు ఒత్తుగా పెరిగి జెల్ ఎక్కువగా రావాలంటే..

కలబంద.. ఈ ఒక్క చెట్టు ఉంటే ఆరోగ్యం, అందానికి ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. అందం విషయంలో కూడా చర్మం, జుట్టు రెండూ సమస్యల్ని కూడా రాకుండా చేస్తుంది. అందుకే, దీనిని ప్రతీ ఇంట్లోనూ నాటుతుంటారు. అలా ఇంట్లో పెంచుకునే వీలు లేకపోతే బయటి నుంచి జెల్ తీసుకొచ్చి మరీ రాస్తుంటారు కూడా. అయితే, చెట్టుని ఇంట్లోనే పెంచాలనుకునేవారు ఒత్తుగా పెరిగి జెల్ ఎక్కువగా రావాలనుకుంటే మాత్రం కొన్ని చిట్కాలు ఫాలో అవ్వాల్సిందే. ఎండ ఉన్న చోట పెంచడంకలబంద మొక్కలు మీరు నేలపై పెంచినా, కుండీల్లో పెంచినా వాటికి ఎండ తగిలేలా చూడండి. ఎక్కువగా ఎండ తగిలితే మొక్కలు చక్కగా పెరుగుతాయి. అలోవెరా మొక్కకి రోజులో కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండలో ఉంటే మంచిది. ఎండ తక్కువగా ఉండి నీడ ఉన్న ప్రాంతంలో అలోవెరా మొక్కలు సన్నగా, చిన్నగా పెరుగుతాయి. మీరు గనుక కుండీల్లో అలోవెరాని పెంచుతుంటే ఎండ ఎక్కడుందో అక్కడి కుండీలను షిఫ్ట్ చేయండి. నీరు పోసే ముందు: కొంతమంది చెట్లకి అదేపనిగా నీరు పోస్తుంటారు. కానీ, అలోవెరా చెట్లకి అలా అవసరం లేదు. అలోవెరా చెట్లు ఎప్పుడు కూడా నీటిని ఆకుల లోపల స్టోర్ చేసుకుంటుంది. అప్పుడే కొమ్మలు దృఢంగా పెరుగుతాయి.



# తమలపాకులతో ఇన్ని లాభాలా!

కొంతమంది తమలపాకులను రోజూ నములుతుంటారు. దీనివల్ల శరీరంలో కొన్ని రకాల ఆరోగ్య సమస్యలుంటే తొలగిపోతాయట. పెద్ద కప్పు నీటిలో కొన్ని తమలపాకులు వేసి నీళ్లు సగమయ్యేంత వరకు మరిగించాలి. ఈ నీటిని తాగడం వల్ల కూడా పలు ప్రయోజనాలు పొందచ్చట. అలాగని ఆరోగ్యానికి మంచిదని అతిగా తీసుకోవడం కూడా మంచిది కాదంటున్నారు నిపుణులు.ఇవి నోటి దుర్వాసనను దూరం చేస్తాయట. అలాగే చిగుళ్ల నుంచి వచ్చే రక్తస్రావాన్ని ఆపి.. దంతాలను దృఢపరిచే గుణం తమలపాకులకు ఉందంటున్నారు నిపుణులు.చర్మంపై దురద, అలర్జీ.. మొదలైన సమస్యలను కూడా తమలపాకులు దూరం చేస్తాయట. వీటిలో ఉండే యాంటీసెప్టిక్ గుణాలే ఇందుకు కారణమట.గాయాలు మానడానికి తమలపాకుల్ని ఉపయోగిస్తారు. ఈ క్రమంలో కొన్ని తమలపాకుల నుంచి తీసిన రసాన్ని గాయంపై రాసి.. దానిపై మరో తమలపాకును ఉంచి కట్టు కట్టాలి. ఫలితంగా గాయం మానే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అయితే ఈ చిట్కాలను పాటించే ముందు ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిది.తమలపాకుల్ని నమిలి, ఆ రసాన్ని మింగడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందట. అందుకే భోజనం చేశాక తాంబూలం వేసుకోవడం మంచిదంటారు.

మెట్రో




తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ- సూర్యాపేట జిల్లా

(సెక్షన్ 11(1) ప్రకారం మరియు 10ఏ మినహాయింపు అనుసరించి) (రూల్ 6/12 చూడుము)

ఫారం-సి
నోటిఫికేషన్

జిల్లా కలెక్టర్, సూర్యపేట ఫైల్ నెం.జి/3552/2025 తేది: 07/10/2026
ఆర్.డి.ఓ హుజూర్ నగర్ ఫైల్‌నెం. నెంబర్: ఎఫ్/1722/2026 తేది: 06/10/2026
గెజిట్ నెంబర్: 55/2026 తేది:07/10/2026

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు దిగువ నిర్దిష్ట పరచిన సూర్యాపేట జిల్లాలోని పాలకవీడుమండలములోనిబెట్టే తండా మజీరా సజ్జాపురంగ్రామము లో విస్తీర్ణము ఎ 3.26గుం.లు భూమిని ప్రజల ఉపయోగార్థం బెట్టీతండా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (ఎత్తిపోతల పథకం) కింద పాలకవీడు మండలం, సజ్జాపురం గ్రామంలోని బెట్టేతండా గ్రామ పంచాయతీ (GP) లో ప్రస్తుతం ఉన్న బెట్టేతండా సీసీ రోడ్డు నుండి కచ్చా రోడ్డును అనుసంధానించే లింక్ రోడ్డు కొరకుఈ దిగువ చూపిన భూములు/ నిర్మాణములు యుక్తముగా అవసరము అయి ఉన్నందున భూ సేకరణ చేయుటకు భావించనైనది.

కావున సూర్యాపేట జిల్లాలోని పాలకవీడుమండలము లోని బెట్టేతండామజీరా సజ్జాపురంగ్రామము లో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ. 3.26గుం.ల గల భూమి యొక్క వివరములు ఈ క్రింద చూపిన వారి నుండి భూ సేకరణ నిమిత్తం నోటిఫికేషన్ జారీ చేయనైనది.

గ్రామం: సజ్జాపురం మండలం: పాలకవీడు జిల్లా: సూర్యాపేట

| క్ర. సంఖ్య | సర్వే నెం. | యాజమాన్యం (పట్టా/ప్రభుత్వ/ఇనాం) | భూమి రకం ఖుష్కీ/ తరి | భూ సేకరణ విస్తీర్ణం | భూమి పట్టాదారులు/ అనుభవదారులు | సరి హద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | నిర్మాణాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 46 | పట్టా | ఖుష్కీ | 0.04 | మోదాలనాగరాజు తండ్రి బుచ్చయ్య (అ) | 45 | 46 | 46 | 157 | - |
| 2 | 46/ఇ | పట్టా | ఖుష్కీ | 0.04 | బండావత్యాచ్య తండ్రి సూర్య (ప&అ) | 45 | 46 | 46 | 157 | (2) పైపులు |
| 3 | 46/5 | పట్టా | ఖుష్కీ | 0.06 | బండావత్జగన్ తండ్రి శివాజీ(అ&అ) | 45 | 46 | 46 | 157 | |
| 4 | 155 | పట్టా | ఖుష్కీ | 0.05 | బండావత్యాచ్య తండ్రి సూర్య (అ) | 155/ 3 | 155/ 1 | 155/ 1 | 154 | |
| 5 | 155/2/ 1 | పట్టా | ఖుష్కీ | 0.08 | మాలోతుచిన్ని భర్త శ్రీను(ప&అ) | 155/ 3 | 155/ 1 | 155/ 1 | 154 | (2) పైపులు |
| 6 | 155 | పట్టా | ఖుష్కీ | 0.06 | మాలోతుపీక తండ్రి చంద్రు (అ) | 155/ 3 | 155/ 1 | 155/ 1 | 154 | (2) పైపులు |
| 7 | 155/5/2 | పట్టా | ఖుష్కీ | 0.03 | మాలోతుహున్ని భర్త సైదా (ప&అ) | 155/ 3 | 155/ 1 | 155/ 1 | 154 | |
| 8 | 155/4 | పట్టా | ఖుష్కీ | 0.03 | మాలోతులాలూ తండ్రి చంద్రు (ప&అ) | 155/ 3 | 155/ 1 | 155/ 1 | 154 | (5) పైపులు |
| 9 | 154 | పట్టా | ఖుష్కీ | 0.081 1/2 | కొండమీదిబాలరాజు తండ్రి కృష్ణయ్య (అ) | 156 | 154/ 3 | 155 | 154 | (2) పైపులు (3) టేకులు |
| 10 | 154/ఆ1/1 | పట్టా | ఖుష్కీ | 0.04 | కొండమీదిబాలస్వామి తండి పిచ్చయ్య (ప&అ) | 156 | 154/ 3 | 155 | 154 | (2) పైపులు |
| 11 | 154/ఆ1/1 | పట్టా | ఖుష్కీ | 0.03 | కొండమీదిబాలస్వామి తండ్రి పిచ్చయ్య (ప&అ) | 156 | 154/ 3 | 155 | 154 | (5) పైపులు |
| 12 | 154/ఆ | పట్టా | ఖుష్కీ | 0. 06 1/2 | కొండమీదికృష్ణయ్య తండ్రి పిచ్చయ్య (ప&అ) | 156 | 154/ 3 | 155 | 154 | బోర్ |
| 13 | 154ఆ | పట్టా | ఖుష్కీ | 0.06 | కొండమీదికృష్ణయ్య తండ్రి పిచ్చయ్య (ప&అ) | 154/ 3 | 116 | 153/ 1 | 153/ 3 | |
| 14 | 153/ఇ1 | పట్టా | ఖుష్కీ | 0.08 | మాలోతు కృష్ణ తండ్రి రాము (ప&అ) | 154/ 3 | 116 | 153/ 1 | 153/ 3 | (5) పైపులు (2) టేకులు |
| 15 | 153 | పట్టా | ఖుష్కీ | 0.01 | బండావత్రాము తండ్రి పెద్ద బిక్షం (అ) | 154/ 3 | 116 | 153/ 1 | 153/ 3 | |
| 16 | 153 | పట్టా | ఖుష్కీ | 0.07 | మాలోతు మంగ్లా తండ్రి శంకర్ (అ) | 154/ 3 | 116 | 153/ 1 | 153/ 3 | (5) పైపులు |
| 17 | 153 | పట్టా | ఖుష్కీ | 0.06 | మాలోతు సుధాకర్ తండ్రి శంకర్ (అ) | 154/ 3 | 116 | 153/ 1 | 153/ 3 | |
| 18 | 153 | పట్టా | ఖుష్కీ | 0.04 | మాలోతు భద్రమ్మ భర్త మోతీరం (అ) | 154/ 3 | 116 | 153/ 1 | 153/ 3 | |
| 19 | 152 | పట్టా | ఖుష్కీ | 0.04 | మాలోతు సుధాకర్ తండ్రి శంకర్ (అ) | 152 | 118 | 153/ 3 | 152 | |
| 20 | 116/ఆ/2/1 | పట్టా | ఖుష్కీ | 0.09 | మాలోతు భద్రమ్మ భర్త మోతీరం (ప&అ) | 154/ 3 | 116/ 1 | 116 | 118 | |
| 21 | 116/ఆ | పట్టా | ఖుష్కీ | 0.04 | మాలోతు బద్య తండ్రి పెద్ద బిక్షం (ప&అ) | 154/ 3 | 116/ 1 | 116 | 118 | |
| 22 | 118 | ప్రభుత్వ (పోరంబోకు) | ఖుష్కీ | 0.03 | మాలోతు భద్రమ్మ భర్త మోతీరం(అ) | 152/ 1 | 117/ 1 | 116/ 1 | 118/ 1 | |
| 23 | 118 | ప్రభుత్వ (పోరంబోకు) | ఖుష్కీ | 0.07 | బండ (అ) | 152/ 1 | 117/ 1 | 116/ 1 | 118/ 1 | |
| 24 | 118 | ప్రభుత్వ (పోరంబోకు) | ఖుష్కీ | 0.03 | మాలోతు బాబు తండ్రి పంతుల్యా (అ) | 152/ 1 | 117/ 1 | 116/ 1 | 118/ 1 | |
| 25 | 117 | పట్టా | ఖుష్కీ | 0.07 | బండాపత్రాములు తండ్రి పెద్ద బిక్షం (అ) | 118/ 1 | వీబి | 117/ 1 | 117/ 3 | |
| 26 | 117ఆ2/1 | పట్టా | ఖుష్కీ | 0.04 | బండావత్బద్య తండ్రి పెద్ద బిక్షం (ప&అ) | 118/ 1 | వీబి | 117/ 1 | 117/ 1 | (6) పైపులు |
| 27 | 117/ఆ3 | పట్టా | ఖుష్కీ | 0.04 | బండావత్సోంల తండ్రి పెద్ద బిక్షం (ప&అ) | 118/ 1 | వీబి | 117/ 1 | 117/ 1 | |
| 28 | 117/ఆ2/1 | పట్టా | ఖుష్కీ | 0.04 | బండావత్బద్య తండ్రి పెద్ద బిక్షం (ప&అ) | 118/ 1 | వీబి | 117/ 1 | 117/ 1 | |
| 29 | 117/ఆ3/2 | పట్టా | ఖుష్కీ | 0.07 | బండావత్సంగి తండ్రి పెద్ద బిక్షం (ప&అ) | 118/ 1 | వీబి | 117/ 1 | 117/ 1 | (1) పైపులు |
| | | | మొత్తం | 3.26 | | | | | | |

ఇట్టిప్రకటన భూసేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని దాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరుపాది పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 ( కేంద్ర చట్టం 30/2013) సెక్షన్ 11(1) ప్రకారం సంబందిత భూ యజమానులకు నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు భూసేకరణ అధికారి మరియు చెవిన్యూ డివిజనల్ అధికారి, హుజూర్ నగర్ వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదేన పని దినములలో కార్యాలయ పని వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము / జిల్లా కలెక్టర్. సూర్యాపేట వారు భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, హుజూర్ నగర్ వారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ -12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేది నుండి ఆ ప్రకటన ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎవరు ఎటువంటి కొనుగోలు / అమ్మకాలు / తాకట్లకు మొదలగు లావాదేవీల చర్యలు చేపట్టరాదు.భూసేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ – 15 ప్రకారం జిల్లా కలెక్టర్, సూర్యాపేట / భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, హుజుర్‌నగర్ గార్లకు ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినములలోపల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసి ఉన్నది.

సం/- భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండల అధికారి, హుజుర్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ సూర్యాపేట
సం/- జిల్లా కలెక్టర్ సూర్యాపేట

DIPR. R.O.No.985/LA-PP/Advt/2026-27

# మోకాళ్ళ నొప్పులకు చెక్ పెట్టే సహజ సిద్ధమైన పోషక నల్ల నువ్వుల లడ్డు



ఈ రోజుల్లో వయసుతో సంబంధం లేకుండా చాలామందిని వేధించే ప్రధాన సమస్య మోకాళ్ళ నొప్పులు. దీనికి ప్రధాన కారణం మోకాళ్ళ మధ్య ఉండే కార్టిలేజ్ (మృదులాస్థి) అరిగిపోవడం. ఎముకలు దృఢంగా ఉండాలన్నా, అరిగిపోయిన గుజ్జు తిరిగి ఏర్పడాలన్నా శరీరానికి తగినంత కాల్షియం చాలా అవసరం. మార్కెట్లో దొరికే సప్లిమెంట్లకు బదులుగా, మన వంటింట్లోని సహజ పదార్థాలతో ఈ సమస్యకు సులభంగా చెక్ పెట్టవచ్చు.

లడ్డు తయారీలో ఉపయోగపడే మూడు ముఖ్య పదార్థాలు

ఎముకలను బలోపేతం చేసే ఈ ప్రత్యేకమైన లడ్డు తయారీకి కేవలం మూడు పదార్థాలు మాత్రమే అవసరం. అవే నల్ల నువ్వులు, ఉసిరికాయలు మరియు తాటి బెల్లం. ఈ మూడింటిలోనూ శరీరానికి కావాల్సిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి, ఇవి ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయి.నల్ల నువ్వులు కాల్షియానికి అద్భుతమైన వనరు. 100 గ్రాముల నల్ల నువ్వులలో లీటరు పాలలో ఉండే దానికంటే ఎక్కువగానే కాల్షియం ఉంటుంది. ఇవి ఎముకల సాంద్రతను పెంచి ఆస్టియోపొరోసిస్ ముప్పును తగ్గిస్తాయి. అలాగే, ఉసిరికాయలలో ఉండే విటమిన్–సి కాల్షియం శోషణకు, కార్టిలేజ్ నిర్మాణంలో కీలకమైన కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయపడుతుంది.

తాటి బెల్లం ప్రాముఖ్యత మరియు శక్తి

ఈ లడ్డులో వాడే తాటి బెల్లం కేవలం సహజమైన తీపిని అందించడమే కాకుండా, ఐరన్ నిల్వలను పెంచి రక్తహీనతను నివారిస్తుంది. ప్రాసెస్ చేసిన చక్కెర కంటే ఇది ఎంతో ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం.



# ఉదయాన్నే కాఫీ, టీలకు బదులు ఒక్క గ్లాస్ ఇది తాగండి..

ఆరోగ్యకరమైన జీవనశైలికి ఉదయం తీసుకునే అల్పాహారం ఎంతో కీలకం. రోజంతా ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండటానికి అవసరమైన శక్తిని, పోషకాలను అందించడంలో రాగులు సూపర్‌ఫుడ్‌గా పనిచేస్తాయి. రాగి జావలో శరీరానికి కావలసిన క్యాల్షియం, ఐరన్, డైటరీ ఫైబర్, ప్రోటీన్లు, విటమిన్ B1,B2 వంటి ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. ఉదయాన్నే క్రమం తప్పకుండా రాగి జావను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల లభించే ముఖ్య ఆరోగ్య ప్రయోజనాలు ఇవే.

తక్షణ శక్తి, వ్యాధి నిరోధక శక్తి

ఉదయాన్నే రాగి జావ తాగడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది.కాఫీ, టీలకు ప్రత్యామ్నాయంగా దీనిని తీసుకోవడం వల్ల రోజంతా అలసట లేకుండా ఉత్సాహంగా ఉండవచ్చు.అంతేకాకుండా,రాగిలో ఉండే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు శరీరంలో రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచడానికి దోహదపడతాయి.బరువు నియంత్రణ సులభంగా బరువు తగ్గడం

రాగిలో పీచు పదార్థం సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను నెమ్మదింపజేసి, కడుపు నిండిన అనుభూతిని ఎక్కువ సమయం కలిగిస్తుంది. దీనివల్ల పదే పదే ఆహారం తినాలనే కోరిక తగ్గి, అదనపు కేలరీలు తీసుకోకుండా బరువును సులభంగా నియంత్రించుకోవచ్చు.

ఎముకల పుష్టి, ఆస్టియోపోరోసిస్ నివారణ

ధాన్యాలన్నింటిలోకెల్లా రాగులలో క్యాల్షియం అత్యధిక పరిమాణంలో ఉంటుంది. ఉదయాన్నే రాగి జావ తాగడం వల్ల ఎముకలు, పళ్లు బలంగా తయారవుతాయి. వయసు పెరిగే కొద్దీ వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల బలహీనత సమస్యల నుంచి ఇది కాపాడుతుంది.మధుమేహం (డయాబెటిస్) నియంత్రణ రక్తహీనతకు చెక్‌రాగిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెరగకుండా క్రమబద్ధీకరిస్తుంది. అయితే, మధుమేహం ఉన్నవారు రాగి జావలో చక్కెర లేదా బెల్లం వేసుకోకుండా తీసుకోవడం శ్రేయస్కరం. అలాగే, ఇందులో ఐరన్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరంలో ఎర్ర రక్తకణాలు పెరిగి రక్తహీనత తగ్గుతుంది. నిత్యం ఉదయపు సమయంలో కాఫీ, టీలను పక్కనబెట్టి ఒక గ్లాసు రాగి జావను అలవాటు చేసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పూర్తి పోషకాలను పొంది ఆరోగ్యంగా ఉండవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**- ఇర్విన్ ఉపసర్పంచ్ గాదెమోని దళపతి గౌడ్**



**మాడ్గుల,అక్టోబర్ 09 (మెట్రో న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మాడ్గుల మండలంలోని ఇర్విన్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామ ఉపసర్పంచ్ గాదెమోని దళపతి గౌడ్ పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ గాదెమోని దళపతి గౌడ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే ఇలాంటి పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడతాయని పేర్కొన్నారు. మన పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో పాఠశాలలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.

విద్యార్థుల సందడి, బతుకమ్మ పాటలతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకలు విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లండం పర్వతాలు, ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులకూ చిక్కులే!

**- ఈసీఐఎల్‌లో అరైవ్ అలైవ్ రహదారి భద్రతా అవగాహన కార్యక్రమం**




**కాప్రా, అక్టోబర్ 9 (మెట్రో న్యూస్):** మైనర్లకు వాహనాలు అప్పగించి ప్రమాదాలకు కారణమైతే తల్లిదండ్రులూ చట్టప రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సి. నరేందర్‌రావు హెచ్చరించారు. ఈసీఐ ఎల్ చౌరస్తా వద్ద శుక్రవారం నిర్వహించిన 'అరైవ్ అలైవ్-2026' రహదారి భద్రతా అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మైనర్లు వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రా ణాలు ధరించాలని, వాహనదారులంతా రహదారి నియ మాలు పాటించాలని సూచించారు. వేగం కంటే ప్రాణాలకే ప్రాధాన్యమివ్వాలని, ట్రాఫిక్ సంకేతాలను గౌరవించాలని విద్యార్థులకు హితవు పలికారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, చిన్నపాటి నిర్లక్ష్యం సైతం ప్రాణనష్టానికి కారణమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ నరసింహులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొని విద్యార్థులు, వాహనదారులకు అవగాహన కల్పించారు.

# దోమ జనరల్ బాడీలో తప్పిన సమయపాలన!

**- మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 3 దాటినా మొదలుకాని వైనం**

**- ఎమ్మెల్యే రాక కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల పడిగాపులు**

**- సమయం వృథా కావడంపై సర్వత్రా అసహనం**



**పరిగి (మెట్రో ప్రతినిధి):** వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య (జనరల్ బాడీ) సమావేశంలో సమయపాలన పూర్తిగా పడకేసింది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2:00 గంటలకే ప్రారంభం కావాల్సిన ఈ కీలక సమావేశం, గంటన్నర దాటినా ప్రారంభానికి నోచుకోకపోవడంపై స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ప్రజా సమస్యలపై చర్చించేందుకు, వివిధ గ్రామాల నుంచి సర్పంచులు, మండల స్థాయి అధికారులు సకాలంలో సమావేశ మందిరానికి చేరుకున్నారు. అయితే, స్థానిక ఎమ్మెల్యే ఇంకా రాకపోవడంతో సమావేశాన్ని ప్రారంభించకుండా నిలిపివేశారు.

**గంటల తరబడి నిరీక్షణ:**

సమయపాలన పాటించాల్సిన పెద్దలే ఆలస్యంగా రావడంపై సభకు వచ్చిన ప్రజాప్రతినిధులు లోలోన గరమ్ అవుతున్నారు. "మా గ్రామాల నుంచి పనులన్నీ పక్కనబెట్టి సమయానికి వస్తే, ఇక్కడ గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది" అని పలువురు ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు సైతం తమ విధులను వదులుకుని ఎమ్మెల్యే రాక కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాల్సిన ఇలాంటి అత్యున్నత సమావేశాల్లో కనీస సమయపాలన పాటించకపోవడంపై మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సర్వసభ్య సమావేశాల్లో సమయపాలన పాటించేలా చూడాలని కోరుతున్నారు.

# మొబిలిటీ సింపోజియం-2026 ప్రజా రవాణా, పట్టణ చలనశీలతపై చర్చ




**మెట్రో న్యూస్ ప్రతినిధి, (సీ ఎం సీ) :** బెంగళూరులో నిర్వహించిన మొబిలిటీ సింపోజియం--2026లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పాల్గొన్నారు. గ్రేటర్ బెంగళూరు అథారిటీ చీఫ్ కమిషనర్, అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో కలిసి పట్టణ ప్రజా రవాణా సామర్థ్యం, భవిష్యత్ అవసరాలు, స్థిరమైన మరియు ప్రతిఘటనాత్మక పట్టణ చలనశీలతపై జరిగిన ప్యానెల్ చర్చలో పాల్గొన్నారు. ఈ సదస్సు అంశంపై నిర్వహించబడింది. బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్ నగరాల్లో ప్రజా రవాణా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడంపై చర్చ జరిగింది. బస్సులు, మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థల విస్తరణతో పాటు నడక, సైక్లింగ్ మౌలిక వసతుల అభివృద్ధి, వివిధ రవాణా మార్గాల మధ్య మెరుగైన సమన్వయం, ఫస్ట్ మైల్-లాస్ట్ మైల్ కనెక్టివిటీ వంటి అంశాలపై నగరాల అనుభవాలను పంచుకున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో కేవలం రవాణా మౌలిక వసతులను పెంచడం మాత్రమే కాకుండా, ప్రజలు తమ ఇళ్ల నుంచి కార్యాలయాలు, ఇతర గమ్యస్థానాలకు వెళ్లే రోజువారీ ప్రయాణాన్ని మరింత సులభంగా, విశ్వసనీయంగా, అందుబాటులో ఉండేలా మరియు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే విధంగా ప్రజా రవాణా వ్యవస్థలను రూపొందించాల్సిన అవసరంపై చర్చించారు. పట్టణాల్లో ప్రజా రవాణా సామర్థ్యాన్ని వేగంగా పెంచడం, బస్సు సేవలను మరింత సమర్థవంతంగా, విశ్వసనీయంగా మార్చడం, నడక మరియు సైక్లింగ్ మౌలిక వసతులను మెరుగుపరచడం, మెట్రో, సబర్బన్ రైలు, బస్సు వ్యవస్థల విస్తరణలో ఎదురయ్యే సవాళ్లపై కూడా ప్యానెల్‌లో చర్చ జరిగింది.

పట్టణాల అభివృద్ధికి అనుగుణంగా ప్రజా రవాణా సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు, సంస్థలు, కార్పొరేట్ రంగం, పౌరుల భాగస్వామ్యం అవసరమనే అంశంపై నగరాల అనుభవాలు, ఆలోచనలను పరస్పరం పంచుకునేందుకు ఈ సింపోజియం ఒక వేదికగా నిలిచింది.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాధికారుల 'దిశ 'సమన్వయం

**- ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన దిశా కమిటీ**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి/కలెక్టరేట్ (మెట్రో న్యూస్):** ప్రభుత్వ పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పేదలకు అందించే విద్యా, వైద్యం పట్ల మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ శాఖల వారీగా సమీక్ష జరుపుతూ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. మల్కాజిగిరి, సైబరాబాద్ కమీషనరేట్ ల పరిధులలో నీడలేని పేదవారికి ఆశ్రయం కల్పించే విధంగా హోమ్ లెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ పరిశుభ్రత పాటించాలని, గర్భిణీలు మరియు పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో రాజీ పడకూడదని సూచించారు. అంగన్ వాడీ కేంద్రాలలో టీచర్లు, ఆయాల కొరత భర్తీ చేసి పనితీరును మెరుగుపరచాలన్నారు. గృహహింసకు గురవుతున్న మహిళలకు అండగా ఉండేందుకు సఖి కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలతో కూడిన లేబర్ రూం, నిరంతరాయం విద్యుత్తు సరఫరా ఉండేలా, మందుల కొరత లేకుండా, సరిపడ వైద్యులు, పారా మెడికల్ సిబ్బందిని భర్తీ చేసుకొని పేదలకు మెరుగైన వైద్య సహాయం 24 గంటలు అందించాలన్నారు. అందుకు అవసరమైన వైద్య పరికరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్కూల్స్ లలో విద్యార్థులకు ఎప్పటికప్పుడు డిఎంఅండ్ హెచ్ ఓ సహకారంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలనన్నారు. ఎలినినో ప్రభావం భారీన పడకుండా అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు, రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి (మేడ్చల్), మర్రి రాజశేఖర్ రెడ్డి (మల్కాజిగిరి), బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్), మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సైబరాబాదు మున్సిపల్ కమిషనర్ సృజన, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జోనల్ కమీషనర్ పింకేష్ కుమార్ తో పాటు మున్సిపల్ ఛైర్మన్లు, అన్ని శాఖల కేంద్ర మరియు జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబురాలు



**పరిగి,మెట్రో న్యూస్ :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దోమలో విద్యార్థులు ఉపాధ్యాయులు బతుకమ్మపండుగ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థి నీలు ఎంతో సంతోషంగా , చక్కగా తరగతికి రెండు చొప్పున బతుకమ్మలను తయారు చేశారని తెలిపారు. మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో బతుకమ్మకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని తెలిపారు. ఈ బతుకమ్మ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో, గ్రామస్తులలో ఐక్యత భావం పెంపొందుతుందని తెలిపారు. తెలంగాణకు ప్రత్యేకమైన పూల పండుగ మహిళల పండుగను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు చక్కని బతుకమ్మ లను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఆర్టీసీ ఎన్నికలు

**- ఫలితాలు 17న ప్రకటన**





**మేడిపల్లి, అక్టోబర్ 09; (మెట్రో న్యూస్)** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పల్ డిపో, ఉప్పల్ జోనల్ వర్క్‌షాప్, చెంగిచెర్ల డిపోలలో టి జి ఎస్ ఆర్ టి సి యూనియన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఆర్టీసీ సిబ్బంది సహకారంతో, మేడిపల్లి పోలీసుల పర్యవేక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. సాంత్రం 6 గంటల వరకు నమోదైన తుది పోలింగ్ వివరాలు: ఉప్పల్ డిపో: 622/ 634, జోనల్ వర్క్‌షాప్: 207/ 210, చెంగిచెర్ల డిపో: 635/ 645 3 కేంద్రాల్లో కలిపి 1,489 ఓట్లకు గాను 1,464 ఓట్లు నమోదై, మొత్తం 98.32% పోలింగ్ నమోదైంది.

## ముస్లింల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం : బండి



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** ముస్లింల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తున్నదని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అన్నారు. మైనారిటీ చైర్మన్‌గా నియమితులైన మొహమ్మద్ చన్ను పాషాను శుక్రవారం రమేష్ శాలువా కప్పి ఆయనకు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ముస్లింలు ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్నారని చెప్పారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు పార్టీకి మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ ఎం.లక్ష్మయ్య, నవాజ్, పాషా, అక్బర్, సచిన్, బర్కత్ అలీ, ప్రసన్న కుమార్, అస్లాం, పర్వేజ్, రమణ, ఖాజా, రమాదేవి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## "ఎమ్మెల్యే మల్‌రెడ్డిపై దుష్ప్రచారం తగదు.. రాజకీయాల్లో హుందాతనమే ముఖ్యం!"

**- సోషల్ మీడియా ప్రచారంపై కావలి వెంకటరమణ ముదిరాజ్ స్పందన**



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన అంశంలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కావలి వెంకటరమణ ముదిరాజ్ స్పందించారు.. తనకు కూతురి వయసున్న మహిళపై ఇలాంటి దుష్ప్రచారాలు సృష్టించడం బాధాకరమన్నారు. పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా ఒక ప్రజా ప్రతినిధిపై ఆరోపణలు చేయడం, వాటిని రాజకీయాలకు ఉపయోగించుకోవడం సరైన పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రజల మధ్య ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రజా ప్రతినిధి అని, ఆయనపై ప్రచారమవుతున్న అంశాన్ని వాస్త వాల ఆధారంగా పరిశీలించాలని కోరారు. కేవలం స్వార్థరాజకీయల కోసం ఇలాంటి ప్రచారాలు చేయటం సరికాదని మహిళలపై అసత్య ప్రచారాలు సమాజానికి మంచిది కాదని కావలి వెంకటరమణ ముదిరాజ్ స్పష్టం చేశారు.

# సీఎంసీ , యూనిసెఫ్ ఇండియా చైల్డ్-ఫ్రెండ్లీ , సేఫ్ సైబరాబాద్‌పై దృష్టి

**మెట్రో న్యూస్ ప్రతినిధి, (సీ ఎం సీ):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ), యూనిసెఫ్ ఇండియా సహకారంతో సిఎంసీ ప్రధాన కార్యాలయంలో "జూనియర్ సిటిజన్స్: ఎ చైల్డ్-ఫ్రెండ్లీ అండ్ సేఫ్ సైబరాబాద్" అంశంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. సైబరాబాద్‌ను పిల్లలకు మరింత సురక్షితమైన, సమగ్ర మరియు అనుకూలమైన నగరంగా అభివృద్ధి చేయడానికి సీఎంసీ ప్రతిపాదిస్తున్న దృష్టికోణం, కార్యాచరణ విధానంపై సమావేశంలో వివరంగా చర్చించారు.

ఈ సమావేశానికి యూనిసెఫ్ ఇండియా డిప్యూటీ రిప్రజెంటేటివ్ (ప్రోగ్రామ్స్) జెస్పర్ మోలర్, యూనిసెఫ్ ఇండియా చీఫ్ ఆఫ్ ఫీల్డ్ సర్వీసెస్ సోలెడాడ్ హెర్రెరో, యూనిసెఫ్ హైదరాబాద్ చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్ డాక్టర్ జెలాలెమ్ బి. టాఫెస్సే, యూనిసెఫ్ హైదరాబాద్ చైల్డ్ ప్రొటెక్షన్ స్పెషలిస్ట్ శ సోనీకుట్టి జార్జ్ హాజరయ్యారు. సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన, అదనపు కమిషనర్ వి.వి.ఎల్. సుభద్రా దేవి, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, వివిధ శాఖల అధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ చైల్డ్-ఫ్రెండ్లీ మరియు సేఫ్ సైబరాబాద్ కోసం సీఎంసీ రూపొందిస్తున్న దృష్టికోణం, ప్రతిపాదిత విధానాన్ని వివరించారు. పిల్లలు, కిశోరులను జూనియర్ సిటిజన్స్‌గా గుర్తిస్తూ, నగర ప్రణాళిక, అభివృద్ధిలో వారి అవసరాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే విధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు. వీధులు, పార్కులు, పాఠశాలలు, ప్రజా ప్రదేశాలు, రవాణా, ప్రాథమిక సేవలు, భద్రత వంటి అంశాల్లో పిల్లలకు అనుకూలమైన విధానాలను ప్రవేశపెట్టడం ఇందులో భాగంగా ఉంటుంది. ప్రతిపాదిత జూనియర్ సిటిజన్స్ కార్యక్రమంలో సెరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ మూడు జోన్లలో పిల్లలతో క్రమబద్ధమైన సంప్రదింపులు, వారి అభిప్రాయాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.




పిల్లల భాగస్వామ్యం, సమగ్రత, భద్రత, పారదర్శకతతో పాటు సీఎంసీ శాఖలు, పాఠశాలలు, కుటుంబాలు, కమ్యూనిటీ సంస్థల మధ్య సమన్వయానికి సమావేశంలో ప్రాధాన్యత ఇచ్చారు. పట్టణ ప్రణాళిక, పార్కులు--ప్రజా ప్రదేశాలు, రవాణా, పౌర సేవలు, పాఠశాలలు, భద్రత వంటి అంశాల్లో చైల్డ్ ఇంపాక్ట్ను పరిగణనలోకి తీసుకునే విధానంపై కూడా దృష్టి సారించారు. కార్యక్రమంలో భాగంగా చైల్డ్ రైట్స్ సెక్రటేరియట్ సెల్‌ను సీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్, సీఎంసీ మరియు యూనిసెఫ్ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. సైబరాబాద్‌లో బాలల హక్కులు, చైల్డ్-ఫ్రెండ్లీ పట్టణ పరిపాలనకు సంబంధించిన కార్యక్రమాలను నిరంతరం సమన్వయం చేయడానికి ఈ సెల్ ఒక సంస్థాగత వేదికగా పనిచేయనుంది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు



సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 09, (మెట్రోన్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా తయారై అధ్యాపకులతో కలిసి వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి బి. మాతేశ్వరి బతుకమ్మలకు పూజ చేసి విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ మంగ్య నాయక్, మహిళా అధ్యాపకులు, ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేసిన సర్పంచ్ సిద్ధగోని శ్రీకాంత్ గౌడ్

బీబీనగర్ మెట్రో న్యూస్ :యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని రాఘవాపురం గ్రామంలో సీ.ఎమ్ .ఆర్. ఏప్ చెక్కు పంపిణీ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో,హాపీ.ఎ.సీ.స్. చైర్మన్ పొట్టోళ్ళ శ్యామ్ గౌడ్హొఆధ్వర్యంలో, రాఘవాపురం గ్రామ సర్పంచ్ సిద్దగోని శ్రీకాంత్ గౌడ్హొసహకారంతో గ్రామానికి చెందిన గొలనుకొండ పద్మకి ₹8,500/- ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు మేకల కుమారస్వామి,హొఅంబటి జంగయ్య,సిద్దగోని యాదగిరి,రక్తని జంగయ్య, గొలనుకొండ మురళి, అంబటి మహేష్, గొలనుకొండ తేజహొతదితరులు పాల్గొన్నారు.

# అధికారుల కృషి వల్లనే సమాచార హక్కు అవార్డు వచ్చింది

### జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్.



నల్గొండ బ్యూరో, మెట్రో న్యూస్.సమాచార హక్కు చట్టాన్ని నల్గొండ జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంలో జిల్లా అధికారులు ,పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు, సహాయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ల కృషి వల్లనే జిల్లాకు అవార్డు వచ్చిందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.సమాచార హక్కు చట్టం అమలులో భాగంగా నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 (1) బి కింద సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించడంలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకుగాను శుక్రవారం జిల్లా కలెక్టర్ హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్ల చేతులమీదుగా అవార్డుతో పాటు, జ్ఞాపికను అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని అధికారులు , సిబ్బంది, ఆయా శాఖలలో సమాచార హక్కు చట్టాన్ని అమలు చేస్తున్న పి ఐ ఓ లు, ఏపీఐవోల కృషి వల్లనే ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు. అలాగే సమాచార హక్కు చట్టం కింద కేసులను పరిష్కరించడంలో కూడా నల్గొండ జిల్లా రాష్ట్రంలో 2 వ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అధికారులందరూ ఇంకా బాగా పని చేస్తే కేసుల పరిష్కారంలో మొదటి స్థానంలో నిలుస్తామని, ఆ విధంగా అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలని ఆయన కోరారు.

# ఆర్టీఐ అమలులో సూర్యాపేట జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు

### రాష్ట్రంలో 'ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా'గా సూర్యాపేట ఎంపిక

### రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



మెట్రో న్యూస్, (అక్టోబర్ 09)సూర్యాపేట ప్రతినిధి: సమాచార హక్కు చట్టం , 2005 అమలులో సూర్యాపేట జిల్లా రాష్ట్రస్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచి ప్రతిష్ఠాత్మక గుర్తింపు పొందింది. పారదర్శక పాలన, జవాబుదారీతనం, సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన అమలులో చూపిన పనితీరుకు గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ సూర్యాపేట జిల్లాను ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా' గా ఎంపిక చేసింది.ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన సమాచార హక్కు వారోత్సవాలు--2026 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నంద్ లాల్ పవార్, ఐఏఎస్, తెలంగాణ రాష్ట్ర గౌరవ గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు.

**పారదర్శక, జవాబుదారీ పాలనకు దక్కిన గుర్తింపు**

ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల సమాచార హక్కును పరిరక్షిస్తూ, ప్రభుత్వ పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది.సమాచార హక్కు చట్టం కింద అందిన దరఖాస్తులకు నిర్ణీత గడువులో సమాచారం అందించడం, దరఖాస్తుల పరిష్కారాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించడం, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చింది.

జిల్లా యంత్రాంగం సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా చేపట్టిన చర్యలు, అధికారులు సిబ్బంది సమష్టి కృషి ఫలితంగా సూర్యాపేట జిల్లాకు ఈ రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది.

**జిల్లా కలెక్టర్‌కు అభినందనల వెల్లువ**

సమాచార హక్కు చట్టం అమలులో రాష్ట్రస్థాయిలో ఉత్తమ జిల్లాగా సూర్యాపేట ఎంపిక కావడం పట్ల జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, సీఎఫ్ఓ దామోదర్ రెడ్డి, ఆర్టీఓ పురుషోత్తమ్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి వల్లోజి శ్రీనివాసరావు, వయోజన విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్. అనిల్ కుమార్, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ ఉపేందర్, డీఎస్డీఓ వెంకట్ రెడ్డి, డీఐఈఓ సులోచన రాణి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ భారతి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసిన నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గం

### రైతుల అభివృద్ధికి కృషి చేస్తాం...నూతన చైర్‌పర్సన్ రంగినేని స్పందన



మెట్రోన్యూస్(అక్టోబర్09)నేరేడుచర్ల: నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రంగినేని స్పందన,వైస్‌చైర్మన్‌గా మునగాల భాస్కర్‌రెడ్డి నియామకంతో పాటు నూతన పాలకవర్గం ఏర్పాటైన నేపథ్యంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం తమపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు.వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా కృషి చేయడంతోపాటు మార్కెట్ కమిటీ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.నూతన పాలకవర్గం ఏర్పాటుకు సహకరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వారు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం వెంకటరెడ్డి,వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి,చలసాని రాజీవ్,చలసాని శ్రీనివాసరావు,చలసాని మంజుల మరియు నేరేడుచర్ల మున్సిపల్ కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులు వివిధ రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు అయ్యేలా కృషి చేయాలి. సండ్ర.....





పెనుబల్లి మెట్రో న్యూస్...పెనుబల్లి మండలం, వీయం బంజర్ లోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఖమ్మం--నల్గొండ--వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ స్థాయి సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి అర్హుడైన గ్రాడ్యుయేట్ ఓటు నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు, ప్రభుత్వ మరియు ప్రైవేటు ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఎల్ఐసీ ఉద్యోగులు, వైద్య సిబ్బంది సహా అన్ని వర్గాల వారిని వ్యక్తిగతంగా కలిసి ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కనగాల వెంకటరావు, మాజీ జెడ్పిటిసి చెక్కిలాల మోహన్ రావు, కోటగిరి సుధాకర్ బాబు, లక్కినేని వినీల్ బాబు,కొప్పుల గోవిందరావు,చెలికాని నిలాద్రి బాబు, పెనుబల్లి సర్పంచ్ పాప, చింత నిప్పు శ్రీనివాసరావు, కోమటి ప్రసాద్, దొడ్డపనేని రవి, ఉప సర్పంచ్ యలమర్తి రాంబాబు, సర్పంచ్ కొంగల రాంబాబు, గోదా చెన్నారావు,యలమర్తి శ్రీనివాసరావు, తావు నాయక్, మందడపు అశోక్,ఆళ్ల కిరణ్, బండారుపల్లి నాగేశ్వరరావు, రొట్టి రాము, తిరుమలశెట్టి వాసు, బెల్లంకొండ చలపతిరావు,ఇమ్మడి వెంకటేశ్వరరావు,కనగాల సురేష్ బాబు,కొప్పుల రంగారావు,ఏటుకూరి వెంకట అప్పారావు,టీవీ రామారావు, మరకాల చంటి, ఎస్కే గౌస్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

### అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎల్-1 జాబితాలోకి తీసుకురావాలి

### నిర్దేశించిన నమూనాలో వాస్తవ సమాచారంతో నివేదికలు సమర్పించాలి

### ఎల్-2, ఎల్-3, ఎల్-0, కొత్త దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

### స్లాబ్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి

### గృహ నిర్మాణ శాఖ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం మెట్రో ఈవినింగ్అక్టోబర్-09:ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.గృహ నిర్మాణ శాఖ పనుల పురోగతిపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన నివేదికలను నిర్దేశించిన నమూనాలో వాస్తవ సమాచారంతో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వాస్తవ వివరాలు సమర్పించకుండా నిర్లక్ష్యం వహిస్తే సమీక్షలు కొనసాగించడంతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో పథకం అమలుకు ఎవరు బాధ్యత వహిస్తున్నారో స్పష్టంగా నిర్ధారించుకొని, ప్రతి అధికారి తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

**మండల స్థాయిలో ఎంపీడీవోలదే పూర్తి బాధ్యత :**

మండల స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ఎంపీడీవోలు పూర్తి బాధ్యత వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హౌసింగ్ ఏఈలు ఎంపీడీవోల సమన్వయంతో పనిచేయాలని, సర్వే వివరాల సేకరణ, నివేదికల సమర్పణ, క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**అర్హులైన దరఖాస్తులను ఎల్-1 జాబితా లోకి తీసుకురావాలి :**

ఎల్-1 జాబితాలోని దరఖాస్తులను గెజిటెడ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హతను నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్-2 జాబితాలోని దరఖాస్తుదారుల అర్హత, భూమి పత్రాల లభ్యతను పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు సమన్వయంతో పరిశీలించి, అర్హులైన వారిని నిబంధనల ప్రకారం ఎల్-1 జాబితాలోకి తీసుకురావాలని సూచించారు.భూమి పత్రాలు లేవనే కారణంతో అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం సరికాదని కలెక్టర్ పేర్కొన్నారు. భూమి ప్రభుత్వ భూమా, ప్రభుత్వ అవసరాలకు కేటాయించిన భూమా, లేక అభ్యంతరాలు లేని ఇతర భూమా అనే అంశాలను సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని నిర్ధారించాలని తెలిపారు. స్థానిక సర్పంచ్‌లు, గ్రామ పెద్దలతో చర్చించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. భూమికి సంబంధించిన యాజమాన్య పత్రాలు అందుబాటులో లేకపోయినా, నిబంధనలకు అనుగుణంగా విద్యుత్ బిల్లులు, ఇతర ఆధారాలను పరిశీలించి, మిగిలిన అర్హతలు సరిపోతే దరఖాస్తులను ఎల్-1 స్థాయికి పంపించాలని ఆదేశించారు. ఈ అంశాలపై శిక్షణ సమయంలోనే స్పష్టమైన సూచనలు జారీ చేశామని తెలిపారు.

**ఎల్-0, ఎల్-3, కొత్త దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి :**

ఎల్-3 జాబితాలో ఉన్న లబ్ధిదారులను గుర్తించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారిని ఎల్-1 జాబితాలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్-2, ఎల్-3, ఎల్-0 జాబితాల్లోని దరఖాస్తులతో పాటు కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారిని ఎల్-1 స్థాయికి తీసుకురావాలని సూచించారు.ఎల్-0, కొత్త దరఖాస్తుల వివరాలను నిర్దేశించిన నమూనాలో తయారు చేసి హౌసింగ్ పీడీకి పంపాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఇందుకోసం అన్ని మండలాలకు ఒకే విధమైన నమూనాను రూపొందించాలని సూచించారు.గెజిటెడ్ అధికారుల పరిశీలన అనంతరం అర్హులైన ఎల్-1 దరఖాస్తులు కలెక్టర్ లాగిన్‌కు చేరుతాయని, అనంతరం సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి విచారణ వివరాలు, స్పష్టమైన సిఫార్సులు, సమర్థన నివేదికలను కలెక్టర్‌కు భౌతికంగా సమర్పించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి సిఫార్సులు పంపించాలని సూచించారు.

**స్లాబ్ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలి :**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్లాబ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లకు చెల్లించే 25 శాతం మొత్తానికి సంబంధించి స్లాబ్ విస్తీర్ణ నిబంధనలను పాటించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా స్లాబ్ వేయని ఇళ్లకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఈ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి మండలంలో ప్రత్యేకంగా మీడియా సమావేశాలు నిర్వహించాలని, స్లాబ్ నిబంధనలపై ప్రత్యేక పత్రికా ప్రకటన విడుదల చేయాలని ఆదేశించారు.మొదటి విడతలో ఎల్-3 జాబితా నుంచి ఇళ్లు మంజూరై, క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభించి, పనుల వివరాలు నమోదు చేసిన లబ్ధిదారులకు ఒకేసారి మినహాయింపుగా ప్రభుత్వం చెల్లింపులు చేస్తుందని తెలిపారు. అయితే పనులు ప్రారంభించని, నిర్మాణ వివరాలు నమోదు కాని ఇళ్లకు ఈ మినహాయింపు వర్తించదని స్పష్టం చేశారు.ఇలాంటి ఇళ్ల లబ్ధిదారులు ప్రస్తుతం నిర్మాణ పనులు ప్రారంభించకుండా గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా గుర్తించిన ఇళ్లకు సంబంధించి ఈ సమాచారం లబ్ధిదారులకు తప్పనిసరిగా చేరాలని సూచించారు.

**క్షేత్రస్థాయిలో ఫలితాలు సాధించాలి :**

ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రాధాన్యతను క్షేత్ర స్థాయి సిబ్బంది అర్థం చేసుకొని బాధ్యతా యుతంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించి పనుల్లో స్పష్టమైన పురోగతి సాధించాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, ఇందిరమ్మ ఇళ్ల నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు, తల్లాడ, రఘునాథ పాలెం, ఖమ్మం అర్బన్, మధిర తహసీల్దార్లు, ఈడీఎం దుర్గాప్రసాద్, ఇందిరమ్మ ఇళ్ల ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆహ్వానం



మెట్రో న్యూస్ ఎర్రుపాలెం :-

: శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రిక, కరపత్రాలను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకీ స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేసి, శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్ మోహన్ రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల విజయ దేవశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీ కెనాల్ ద్వారా ఏపీ ప్రభుత్వం నీటిని తరలిస్తోంది




అలంపూర్, అక్టోబర్ 09 (మెట్రో న్యూస్) : ఆర్డీఎస్ కు రావలసిన నీటిని ఏపీ ప్రభుత్వం కేసి కెనాల్ ద్వారా తరలిస్తుందని సింగవరం- 1 సర్పంచ్ గొంగోళ్ళ ఈశ్వర్ తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల జేఏసీ సమావేశం మహబూబ్ నగర్ టీఎన్జీవో భవనంలో శుక్రవారం నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టుల పైన, ఆర్డీఎస్ నీటి పైన ఉన్నతస్థాయి సమావేశం రాజేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఇందులో భాగంగా సింగవరం-1 సర్పంచ్ గొంగోళ్ళ ఈశ్వర్ మాట్లాడుతూ...ఆర్డీఎస్ ప్రాజెక్టుపై నవంబర్ ఒకటో తేదీ అలంపూర్ చౌరస్తాలో ఉన్నత స్థాయి సదస్సును నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్డీఎస్ పైన నియోజకవర్గంలో పదివేల మంది రైతులతో సంతకాల నిర్వహణ చేపట్టి త్వరలోనే అలంపూర్ నియోజకవర్గంలో ఆర్డీఎస్ ప్రాజెక్టు గురించి పాదయాత్ర నిర్వహించాలని చర్చించినట్ల ఆయన తెలిపారు. ఆర్డీఎస్ కు నీళ్లు రాకపోవడానికి ముఖ్య కారణం కర్ణాటక అక్రమంగా రెండు లక్షల ఎకరాలకు నీళ్లు తోడు పోసుకుంటుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా కేసీ కెనాల్ ద్వారా నీళ్లు తరలించి రెండు లక్షల ఎకరాలకు నీరందించి రాళ్ల సీమను కోనసీమగా మారుస్తుంటే మన పాలకులు చూసుకుంటూ ప్రేక్షక పాత్ర వహించడం చాలా బాధాకరమన్నారు. దీనిపైన పెద్ద ఎత్తున చర్చ జరిగి ఉద్యమానికి తెర తీయాలని చెప్పి సమాన వేషంలో చర్చించినట్లు తెలిపారు. ఇందులో అలంపూర్ నియోజకవర్గం నుంచి రామ్మోహన్, ఇటిక్యాల పాడు సురవరం లోకేశ్వర్ రెడ్డి, కంచుపాడు మాజీ సర్పంచ్ శేషన్ గౌడ్, ఏబీఎన్ టీవీ శేషు, నరసింహ, గోపాల్ రె

# ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



పెబ్బేరు మెట్రో న్యూస్ వసతి గృహాల్లో విద్యార్థినుల ఆరోగ్యం, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. పెబ్బేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని బీసీ బాలికల వసతి గృహంలో బుధవారం రాత్రి విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం వసతి గృహాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, తాగునీరు, వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలపై సంబంధిత అధికారులు, విద్యార్థినులను విచారించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులు స్పందిస్తూ మొత్తం 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు, వారందరినీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వసతి గృహంలో బుధవారం రాత్రి చికెన్ తో భోజనం చేసిన అనంతరం కొందరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. ఈ ఘటనకు ఆహారం కలుషితం కావడం కారణమై ఉండవచ్చని తెలిపారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినులకు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వసతి గృహంలో తాగునీటి శుద్ధి యంత్రానికి సంబంధించిన ఫిల్టర్‌ను వెంటనే మార్చించాలని, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రతను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు భోజనం వడ్డించే ముందు సంబంధిత అధికారులు తప్పనిసరిగా ఆహారాన్ని రుచి చూసి, నాణ్యతపై పూర్తి నమ్మకం కలిగిన తర్వాతే వడ్డించాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల్లో విద్యార్థినుల ఆరోగ్యం, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు సురక్షితమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారిని ప్రమీల, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# యాపులు వివోఏల లాగిన్ లో ఉంటాయి

### సీసీ వహీదా వివరణ

అలంపూర్ అక్టోబర్, 09 (మెట్రో న్యూస్) : మహిళా సమాఖ్యలో పని చేసే వివోఏలు యాపులను ఉపయోగిస్తూ పని చేయాల్సిందేనని, ఆ యాపులు వివోఏల లాగిన్ లోనే ఉంటాయని శుక్రవారం సిసి వహీదా తెలిపారు. సిసి వేధిస్తున్నారని మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం వివోఏలు ఏపిఎం మార్తమ్మకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సీసీ వహీదా వివరణ ఇస్తూ యాపులు వారి లాగిన్ లోనే ఉంటాయి, పనిచేయమని చెబుతాము ఎవరిని వేధించడం లేదన్నారు. మండలంలో సరిగా పని జరగకపోతే పై అధికారుల నుండి మాకు ఒత్తిడి ఉంటుందని తెలిపారు. యాపులపై అవగాహన కల్పించడం తన పరిధిలో లేదన్నారు. సమావేశాల్లో పాల్గొంటే తెలియని విషయాలు ఏవైనా చెబుతామన్నారు. రుణాల రికవరీ, సంఘాల నిర్వహణ విషయంలో మెరిట్ ఉంటేనే వివోఏలకు వేతనాలు అందుతాయి అన్నారు. యాపులు చేయలేకపోతే వేరే వారిని తీసుకోవాలని పైనుండి చెబుతున్నట్లు సిసి తెలిపారు. లింగనవాయి, ఊట్కూర్, సింగవరం-2 వివోఏలు పనిచేయడంలో వెనుకబడిపోతున్నట్లు ఆమె తెలిపారు.

## మిషన్ భగీరథ మెయిన్ వాల్వ్ వద్ద వృథాగా పోతున్న మంచినీరు - డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసుల ఆందోళన



మెట్రో న్యూస్( జడ్చర్లటౌన్) అక్టోబర్ 07:జడ్చర్ల మండలం చర్లపల్లి గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ వద్ద మిషన్ భగీరథ మెయిన్ వాల్వ్ నుంచి మంచినీరు వృథాగా బయటకు వస్తోంది. వాల్వ్ వద్ద రక్షణ ఛాంబర్ లేకపోవడంతో నీరు బహిరంగ ప్రదేశంలో నిలిచిపోయి కలుషితమవుతోంది. సమాచారం ప్రకారం, ఈ మెయిన్ వాల్వ్ నుంచి వస్తున్న నీరు నేరుగా డబుల్ బెడ్ రూమ్ కాలనీ తాగునీటి సంపు దగ్గరకు చేరుతోంది. మురుగు, చెత్తతో కలిసి నీరు కలుషితం కావడంతో ఆ నీటిని తాగితే అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపించారు. తక్షణమే మెయిన్ వాల్వ్ వద్ద ఛాంబర్ నిర్మించి, లీకేజీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కలుషిత నీటి వల్ల తమ ప్రాణాలకు హాని కలిగితే బాధ్యత ఎవరు వహిస్తారని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## మహాత్మా గాంధీ పీస్ అవార్డు అందుకున్న కిరణ్మయి లక్ష్మణ్




మెట్రో న్యూస్ మహబూబ్నగర్ టౌన్ మహాత్మా గాంధీ 157వ జయంతిని,పురస్కరించుకుని,తెలంగాణ,ఇంటలెక్చువల్ ఫోరం అందించిన మహాత్మా గాంధీ పీస్ అవార్డు--2026ను జ్ఞాన భారతి పాఠశాల కరస్పాండెంట్ కిరణ్మయి లక్ష్మణ్ అందుకున్నారు. జ్ఞాన భారతి విద్యాసంస్థ ద్వారా పాలమూరు జిల్లాలోని మారుమూల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న లక్ష్మణ్ --కిరణ్మయి దంపతుల సేవలకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా కిరణ్మయికి పాఠశాల సిబ్బంది, పలువురు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, ఆకాంక్షించారు.

## 50 అడుగుల రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం



మెట్రో న్యూస్ మెదక్ ప్రతినిధి: ప్రధాన రహదారికి ప్రత్యామ్నాయంగా మెదక్ పట్టణంలోని 9వ వార్డులో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న 50 అడుగుల ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు శుక్రవారం 9వ వార్డు కౌన్సిలర్ జుబేర్ అహ్మద్ నేతృత్వంలో మున్సిపల్ చైర్మన్ రాధిక వైస్ చైర్మన్ నరేష్ గౌడ్లు పనులు ప్రారంభించడం పట్ల కౌన్సిలర్ జుబేర్ అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం కావడం 9వ వార్డు ప్రజలతో పాటు మెదక్ పట్టణ ప్రజలకు ఎంతో సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. మెదక్ పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఒకటిగా ఉన్న 9వ వార్డు 50 అడుగుల రహదారి అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించిన గౌరవ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు జుబేర్ అహ్మద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో, సహకారంతో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ రహదారి అభివృద్ధి పనులు కార్యరూపం దాల్చడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జుబేర్ అహ్మద్ మాట్లాడుతూ, 9వ వార్డులోని ఈ ప్రధాన రహదారి పరిసర ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, వ్యాపార సంస్థలు అధికంగా ఉన్నందున ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు.

## బృందావన్ కాలనీలో బతుకమ్మ సీసీ ప్లాట్ఫామ్ నిర్మాణానికి శంకుస్థాపన.



.మెట్రో న్యూస్ జోగిపేట్. అందోల్ జోగిపేట మున్సిపల్ 3వ పరిధిలోని బృందావన్ కాలనీలో బతుకమ్మ సీసీ ప్లాట్ఫామ్ నిర్మాణానికి శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేపట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగను దృష్టిలో పెట్టుకొని కాలనీ మహిళల విజ్ఞప్తి మేరకు సీసీ ఫ్లాట్ ఫామ్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అన్ని వార్డులు అభివృద్ధి పనులు చేపడుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బృందావన్ కాలనీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అల్లే శ్రీకాంత్, బస్వ సత్య ప్రకాష్,3,19 వార్డు కౌన్సిలర్లు మర్రి అరుణకుమారి, అల్లే మంజుల, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల ప్రవీణ్, కోరబోయిన నాగరాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో ఘనంగా మన్యవర్ కాన్షిరాం 20వ వర్ధంతి కార్యక్రమం

### ముదిరాజ్ భవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి కార్యక్రమం.. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు



మెట్రో న్యూస్ / పటాన్చెరు బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకులు మన్యవర్ కాన్షిరాం 20వ వర్ధంతి కార్యక్రమాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో శుక్రవారం పటాన్‌చెరులోని ముదిరాజ్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పటాన్‌చెరు జాతీయ రహదారిపై ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా ముదిరాజ్ భవన్‌కు చేరుకుని మన్యవర్ కాన్షిరాం చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడపట్ల ఈశ్వర్ ముఖ్య అతిథిగా, లింగంపల్లి యాదగిరి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సతీష్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఉమేష్, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి మోహన్, మరో ఇన్‌చార్జి పంగ బాబు పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ అసెంబ్లీ కమిటీల ప్రతినిధులు, బీఎస్పీ పటాన్‌చెరు అసెంబ్లీ ఇన్‌చార్జులు నర్దింగ్వి రావు, వినయ్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు దర్శన్, కార్యదర్శి శ్రీను, కోశాధికారి వేణు హాజరయ్యారు. బీఎస్పీ సీనియర్ నాయకులు సంజీవ, జనార్దన్, కృష్ణ, బాలరాజు, అనిత, రేణుక, మంజుల, సుధీర్, శ్రీధర్, అశోక్ తదితరులు పాల్గొని మన్యవర్ కాన్షిరాంకు నివాళులర్పించారు.

# జాతీయ వేదికపై నేరడిగుంట ప్రస్తావన.. సర్పంచ్ సాయికిరణ్ కృషికి ఐఏఎస్ అధికారి ప్రశంసలు!



మెట్రో న్యూస్ జోగిపేట్. దేశవ్యాప్తంగా ఎంపికైన 17 మంది సర్పంచ్‌లలో తెలంగాణ నుంచి నేరడిగుంటకు ప్రాతినిధ్యం లభించిందిజాతీయ వేదికపై సర్పంచ్ సాయికిరణ్ మాటలకు ఐఏఎస్ అధికారి ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 17 మంది సర్పంచ్‌లలో తెలంగాణ నుంచి సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం నేరడిగుంట గ్రామ సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ యాదవ్‌కు అవకాశం లభించడం విశేషం. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని తాగునీరు, పారిశుద్ధ్య విభాగం (డిడిడబ్ల్యూఎస్) నిర్వహించిన జాతీయ స్థాయి సర్పంచ్ సంవాద్ కార్యక్రమంలో ఆయన తన గ్రామ అభివృద్ధి ఆలోచనలను, ప్రజల భాగస్వామ్య ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి అధికారులు పాల్గొనగా, స్వచ్ఛ భారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్ ఐఏఎస్ అధికారి శ్రీమతి ఐశ్వర్య సింగ్ గారు సర్పంచ్ సాయికిరణ్ చెప్పిన అంశాలను ప్రస్తావిస్తూ ప్రశంసించచారుసర్పంచ్, పారిశుధ్య కార్మికులు, గ్రామ ప్రజలు సమన్వయంతో కలిసి పనిచేస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలనే ఆలోచనను సాయికిరణ్ వివరించారు. ఈ సమిష్టి కృషి ప్రాముఖ్యతను గుర్తించిన ఐఏఎస్ అధికారి ఐశ్వర్య సింగ్ గారు" ప్రశంసించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఒగ్గు సాయి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని మరింత పరిశుభ్రంగా ఆదర్శంగా తీర్చిదిద్దేలకు కృషి చేస్తానన్నారు.

## గీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి





(మెట్రో న్యూస్)రామచంద్రాపురం: వి. గీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు.
ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, భావితరాలకు మన పండుగల గొప్పతనాన్ని తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మెట్రో ఈవినింగ్స్
METRO EVENINGS
ఆదిలాబాద్-నిజామాబాద్
మంచిర్యాల | కామారెడ్డి
ఆసిఫాబాద్
నిర్మల్
epaper.metroevenings.com
తేది : శనివారం అక్టోబర్ 10 2026


# బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ రాజాగౌడ్.





నిజామాబాద్, అక్టోబర్ 9 (మెట్రోన్యూస్ )నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా (రెవెన్యూ) రాజాగౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్ కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ కు స్వాగతం పలికి, పరిచయం చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ఎస్.కిరణ్ కుమార్ పదవీ విరమణ చేయగా, ఆయన స్థానంలో జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా కొనసాగుతున్న రాజాగౌడ్ ను నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ప్రభుత్వం ఇటీవలే పోస్టింగ్ కల్పించింది. ఈ మేరకు ఆయన శుక్రవారం ఇక్కడికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్ఓ గీత, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ ను బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసి స్వాగతం పలికారు. కాగా, అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ఇదివరకు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని బాన్సువాడ, బోధన్, ఆర్మూర్ లలో రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్.డీ.ఓ)గా విధులు నిర్వర్తించారు.

# పర్యావరణానికి ముప్పు చేసే వ్యర్థాలకు చెక్!

## మందమర్రి సింగరేణిలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ




మెట్రో న్యూస్, రామకృష్ణాపూర్/ మందమర్రి: అక్టోబర్ 09/2026. పర్యావరణ పరిరక్షణకు పరిశుభ్రతే పునాది అని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఈ నెల 2 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో నిరుపయోగంగా ఉన్న విద్యుత్ పరికరాల విడిభాగాలు, తెరలు, అక్షరముద్రణ పలకలు, సూచిక పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎన్. రాధాకృష్ణ స్వయంగా సేకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డబ్బాలో వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడైపోయిన ఎలక్ట్రానిక్ పరికరాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించాలని సూచించారు. పాత చరవాణులు, గణక యంత్రాలు, విద్యుత్ తీగలు, స్విచ్‌లు తదితర వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. కార్యాలయాలతో పాటు ఇళ్లలోనూ ఈ వ్యర్థాలను బాధ్యతాయుతంగా తొలగించాలని పిలుపునిచ్చారు. కార్యాలయాలు, గనుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భూగర్భ, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు అధికారులు, ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. పరిశుభ్రతను అలవాటుగా మార్చుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

**అధికారుల భాగస్వామ్యం**

ఈ కార్యక్రమంలో జీఎంకు ప్రత్యేక అధికారి జి.ఎల్. ప్రసాద్, సిబ్బంది విభాగం ఉప జనరల్ మేనేజర్ సి.హెచ్. అశోక్, విద్యుత్, యాంత్రిక విభాగం సహాయ జనరల్ మేనేజర్ బాలాజీ భగవతీ జా, ఆర్థిక విభాగం సహాయ జనరల్ మేనేజర్ ఆర్.వి.ఎస్.ఆర్.కే. ప్రసాద్, సర్వే విభాగం ఉప జనరల్ మేనేజర్ బుఖ్యా దేశాయి, సమాచార సాంకేతిక విభాగం ఉప మేనేజర్ రవి, కొనుగోళ్ల అధికారి బాబు, ఏరియా అటవీ శాఖ అధికారి నవీన్‌తో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రేసీ ఆర్గనైజేషన్‌లో బధిర విద్యార్థులతో సీపీ ముఖాముఖి

**-బధిరుల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకొని , వారికి అండగా నిలవాలి**

**-పోలీసు సిబ్బందికి సూచనలు చేసిన పోలీస్ కమీషనర్**



నిజామాబాద్, అక్టోబర్ 9( మెట్రోన్యూస్ )బధిరుల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకొని , వారికి అండగా నిలవాలని పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నాలుగవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రేసి ఆర్గనైజషన్ ఫర్ డెవలప్మెంటల్ సర్వీసెస్ లో బధిర విద్యార్థులు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు , ఇబ్బందులు , వాటి పరిష్కారంలో పోలీసుల పాత్రపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సమాజంలో బధిర విద్యార్థులు వివిధ సందర్భాల్లో ఎదుర్కొనే ఇబ్బందులను పోలీసులు సున్నితంగా అర్థం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బధిరులు తమ సమస్యలను సాధారణంగా మాట్లాడి తెలియజేయలేని పరిస్థితుల్లో , వారితో ఎలా సంభాషించాలి , వారి ఇబ్బందులను ఎలా తెలుసుకోవాలి , ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో ఎలా సామరస్యంగా , గౌరవప్రదంగా వ్యవహరించాలి అనే అంశాలపై పోలీసు సిబ్బందికి వివరించారు. బధిర విద్యార్థులు లేదా దివ్యాంగులు ఏదైనా సమస్యతో పోలీసులను ఆశ్రయించినప్పుడు వారిని నిర్లక్ష్యం చేయకుండా , వారి పరిస్థితిని అర్థం చేసుకొని , అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. అవసరమైన చోట సంజ్ఞా భాష తెలిసిన వ్యక్తుల సహాయం తీసుకొని , బాధితులు తమ సమస్యలను స్వేచ్ఛగా తెలియజేసేలా అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రజలందరికీ సమానంగా సేవలందించే వ్యవస్థగా ఉండాలని , ముఖ్యంగా దివ్యాంగుల పట్ల మరింత సానుభూతి , సహనం , మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. అనంతరం బధిర విద్యార్థులకు పుస్తకాలు , నోట్‌బుక్స్ , దుస్తులను పోలీస్ కమిషనర్ అందజేశారు. విద్యార్థులతో ఆత్మీయంగా మెలుగుతూ , వారికి భోజనం స్వయంగా వడ్డించి వారితో కలిసి సమయం గడిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆత్మీయత , భద్రతాభావం పెంపొందించడంతో పాటు , దివ్యాంగుల సమస్యల పట్ల పోలీసు సిబ్బందిలో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ అండ్ శుభం ప్రకాష్ నిజామాబాద్ ఏసిపి ప్రకాష్, సిసిఆర్ వి ఏ సి పి గురు నాయుడు, సిఐలు,ఎస్ఐలు గ్రేసీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ ఆర్. శోభారాణి, సెక్రెటరీ జనరల్ సెక్రెటరీ వై ఎస్ శ్రీనివాస్ రావు,మురళి,తదితరులు పాల్గొన్నారు.

# పూల సింగిడిలా.. పాఠశాలల్లో బతుకమ్మ సందడి!

## రామకృష్ణాపూర్‌లో ముందస్తు సంబరాలు







మెట్రో న్యూస్, రామకృష్ణాపూర్: అక్టోబర్ 09/2026.పట్టణంలోని పలు పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తవక్కల్ పాఠశాల, సెయింట్ జాన్స్, సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంబరాలు జరుపుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ, కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాలల ప్రాంగణాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాలల కరస్పాండెంట్లు మాట్లాడుతూ.. బతుకమ్మ అంటే బతుకు అమ్మ అని, ప్రకృతితో మమేకమైన ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులు చదువులో రాణిస్తూ కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి వేడుకలతో విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందుతుందని పేర్కొన్నారు.

# సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.

**-అదనపు కలెక్టర్ వి.భుజంగరావు.**






నిజామాబాద్ , అక్టోబర్ 9 (మెట్రోన్యూస్ ) సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సూచించారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాన్ని నిజామాబాద్ కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ నేతృత్వంలో ఆయా శాఖల అధికారులు ఎల్.సీ.డీ తెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. సమాచార హక్కు చట్టం అమలు ఆవశ్యకతపై రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, ఇతర అతిథుల ప్రసంగాలను ఆలకించారు. ఆర్.టి.ఐ అమలుపై చేయించిన ప్రతిజ్ఞలో అన్ని శాఖల పీఐఓలు, ఏపీఐఓలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ, పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందిస్తామని, స్వచ్ఛందంగా ఇవ్వవలసిన సమాచారాన్ని పౌరులకు అందుబాటులో ఉండేలా వ్యవహరిస్తామని, పనితీరులో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పాటిస్తూ పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సమాచార చట్టాన్ని పక్కాగా అమలు చేస్తూ, నిజామాబాద్ జిల్లాకు కూడా అవార్డులు సాధించి ప్రత్యేక గుర్తింపు తేవాలని అదనపు కలెక్టర్ సూచించారు. నిర్ణీత గడువు లోపు సమాచారాన్ని అందిస్తూ, రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలన్నారు. లేనిపక్షంలో అప్పీలేట్ అథారిటీ చేపట్టే చర్యలకు గురి కావాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి గీత, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల ప్రయోజనానికే భూముల రీసర్వే.

**-కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి.**

**-ఫతేపూర్ లో నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియ పరిశీలన.**



నిజామాబాద్, అక్టోబర్ 9 (మెట్రోన్యూస్ )రైతులు, భూ యజమానుల ప్రయోజనాలను కాపాడుతూ, భవిష్యత్తులో వారికి ఎలాంటి భూ సమస్యలు తలెత్తకూడదు అనే సదుద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే జరిపిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. ఈ ప్రక్రియకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. సాలూర మండలం ఫతేపూర్ లో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, రోవర్ సహాయంతో సర్వే నిర్వహిస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా పాటిస్తూ, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, తద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కావని అధికారులకు సూచించారు. రైతులు, పట్టాదార్లకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రతిరోజు సగటున 30 ఎకరాల చొప్పున సర్వేను నిర్వహిస్తూ, వేగవంతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే, తమ దృష్టికి తేవాలన్నారు. సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలో సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. భూమి హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాలూర మండలంలో తొలి విడతలో మూడు గ్రామాలలో భూముల రీసర్వే జరుగుతోందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటికే బోధన్ రెవెన్యూ డివిజన్ లోని పోతంగల్, రెంజల్ తదితర మండలాల్లో 3వేల ఎకరాల వరకు విస్తీర్ణంలో సర్వే ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. రీసర్వే వల్ల భవిష్యత్తులో సరిహద్దు సమస్యలు ఉత్పన్నం కావని, తద్వారా భూ వివాదాలకు ఆస్కారం ఉండదని, భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్వే విషయంలో రైతులకు, భూ యజమానులకు ఏవైనా సందేహాలు ఉంటే గ్రామ పంచాయతీ అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ విజయకుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు శ్రీనివాస్ రావు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు ఉన్నారు.

# కాకతీయ విద్యాసంస్థల్లో దసరా, బతుకమ్మ పండుగ వేడుకలు



నిజామాబాద్, అక్టోబర్ 9( మెట్రోన్యూస్ )కాకతీయ నిజామాబాద్ విద్యాసంస్థల్లో దసరా,బతుకమ్మ పండుగ వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఉపాధ్యాయులు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ విభాగం అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు సంయుక్తంగా వినూత్నంగా దుర్గాదేవి విగ్రహాలను రూపొందించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ వేడుకల్లో ప్రధానంగా 7 ఫీట్ల ఎత్తు కలిగి, తెలంగాణ సంస్కృతి, దేశభక్తి ప్రతిబింబించే దుర్గాదేవి ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనిని ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు రూపొందించారు.ఈ వేడుకల్లో నవదుర్గమాతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుర్గాదేవి పరాశక్తి స్వరూపం. ముఖ్యంగా స్త్రీ శక్తికి చిహ్నంగా నిలుస్తూ, భక్తులలో ఆత్మవిశ్వాసం, ధృఢ సంకల్పాన్ని పెంపొందిస్తుంది. నవరాత్రులలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, లలితా త్రిపుర సుందరి, సరస్వతి, లక్ష్మి, మహిషాసుర మర్దిని వంటి వివిధ రూపాలలో ఆరాధిస్తారు. ఈ విధంగా తొమ్మిది రోజుల్లో తొమ్మిది అవతారాలలో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఆకట్టుకున్న రోబోటిక్ దుర్గామాత: ఈ వేడుకల్లో × 20 అధ్యాపకులు, విద్యార్థులు తయారు చేసిన రోబోటిక్ దుర్గమాత ఎంతో ఆకట్టుకుంది. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ ప్రతిమ విద్యార్థుల భక్తికి, తెలివికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా బతుకమ్మ సంబరాలను కూడా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజనీకాంత్ మాట్లాడుతూ... “చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ప్రతీ సంవత్సరం ఈ వేడుకలు జరుపుకుంటాము. విద్యార్థులు ఎల్లప్పుడూ మంచి మార్గంలో నడవాలి. అధ్యాపకులు వారికి సరైన దిశానిర్దేశం చేస్తూ, తద్వారా భావి భారత పౌరులై దేశానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని” విద్యార్థులకు తెలియజేశారు. అలాగే విద్యార్థుల్లో విద్యాబుద్ధులతో పాటు దేశభక్తి, రాష్ట్రాభిమానం మరియు సంస్కృతీ సాంప్రదాయాలపై అవగాహన పెంచేందుకే ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్లు రాజా, తేజస్విని, రామోజీరావు, కాకతీయ విద్యాసంస్థల విద్యార్థినీ, విద్యార్థులకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు ముందస్తుగా దసరా–బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఎంతో ఘనంగా జరిగిన ఈ వేడుక సందర్భంగా కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ సి.హెచ్. విజయలక్ష్మి జిల్లా విద్యార్థినీ, విద్యార్థులకు, జిల్లా అధ్యాపకులకు, జిల్లా తల్లిదండ్రులకు, జిల్లా ప్రజలందరికీ మంచి జరగాలని, అన్నీ విజయాలు దక్కాలని ఆశిస్తూ ముందస్తు పండగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో ప్రిన్సిపాళ్లు రణదీశ్, సందీప్, గిరిధర్, చంద్రశేఖర్, భావన, ఫణీందర్, రాజ్ కిరణ్, విపిన్, నటరాజ్, సంతోష్, సుచరిత, రాఘవేంద్ర ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవి శరణు నవరాత్రి ఉత్సవాల కరపత్రాలు విడుదల

బాన్సువాడ అక్టోబర్09 మెట్రో న్యూస్ బాన్సువాడ పట్టణంలో ని కోటగల్లీ లో వెలసిన శ్రీ కోట దుర్గమ్మ ఆలయ దేవి శరణు నవరాత్రి ఉత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ శ్రీ శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీ శ్రీ శ్రీ సుదర్శన ఆశ్రమం దండి స్వామీజీ వారి కరకములాచే దేవి ఉత్సవాల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించటం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ద

**నేడు దండి స్వామిజీ ఆధ్వర్యంలో**

**భవాని మాలధారణలు**



బాన్సువాడ అక్టోబర్09 మెట్రో న్యూస్ బాన్సువాడ పట్టణంలో ని కోటదుర్గమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11 వ తేదీ ఆదివారం నాడు ఉదయం ఆరు గంటల నుండి భవాని మాలధారణలు వేయడం జరుగునని కాశి దండి సుదర్శన స్వామిజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో అమ్మవారి దీక్షలు చేపట్టాలని ఆయన కోరారు. మాలధారణల అనంతరం అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు

# దసరా వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### అధికారుల సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం కావాలి

### ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్



మెట్రో న్యూస్ గోదావరిఖని.జవహర్‌లాల్ నెహ్రూ సింగరేణి (జేఎన్ఎస్) స్టేడియంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సింగరేణి, మున్సిపల్, పోలీస్ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణ, భద్రతా చర్యలు, ప్రజలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, దసరా వేడుకలకు నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేడియం ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని, నిరంతర తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాలంకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్, సింగరేణి అధికారులకు సూచించారు. పోలీస్ శాఖ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, ప్రజల భద్రత దృష్ట్యా గట్టి బందోబస్తు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రజలు తమ కుటుంబ సమేతంగా వచ్చి ఉల్లాసంగా, ఉత్సాహంగా వేడుకలను తిలకించేలా అన్ని విభాగాల అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ జల్ల అరుణశ్రీ, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ఏసీపీ రమేష్, సీఐ ఇంద్రసేన రెడ్డితో పాటు సింగరేణి, మున్సిపల్ కార్పొరేషన్లకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రాళ్లపేటలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మునిగేల రాజు



మెట్రో న్యూస్, తంగళ్ళపల్లి : తంగళ్ళపల్లి మండలం రాళ్లపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మునిగేల రాజు ముఖ్య అతిథులుగా పాల్గొని సర్పంచ్ పరశు రాములతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా అందే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందించాలనే లక్ష్యంతో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇమామ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, కాంగ్రెస్ మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ బాబు ఆలీ, నాయకులు కట్కం రాజశేఖర్, గణాధి కిషన్, ఇక్బాల్, సురేష్, దేవరాజు, బాలసాని శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మి నరసింహస్వామి సన్నిధిలో సామాజిక సమరసత వేదిక సమావేశం




జగిత్యాల జిల్లా/బీర్పూర్, అక్టోబర్ 09 (మెట్రో న్యూస్) : బీర్పూర్ లోని లక్ష్మి నరసింహస్వామి సన్నిధి గుట్టపై సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సామాజిక సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సురేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, జగిత్యాల నగర అధ్యక్షులు బొందుకూరి శ్రీనివాస్, మండల అధ్యక్షులు రవితేజ, ఆలయ అర్చకులు మదు లతో పాటు వేదిక కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల మధ్య సామరస్యం, ఐక్యత పెంపొందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఏకం చేయడానికి వేదిక కృషి చేస్తుందని తెలిపారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

## నిర్ణీత గడువులోగా జగిత్యాల మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

### విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనపై ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష



జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09 (మెట్రో న్యూస్) : మెడికల్ కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, మెడికల్ కళాశాల విద్యార్థి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పురోగతి, విద్యార్థుల సమస్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. జగిత్యాల మెడికల్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్ అండ్ బీ ఇంజినీరింగ్ శాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాలలో ఇంకా పూర్తికావాల్సిన నిర్మాణ పనులను గుర్తించి, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా తరగతి గదులు, ఇతర అవసరమైన వసతులను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించాలని తెలిపారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ పనులన్నింటినీ విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్‌కు, విద్యార్థి నాయకులకు హామీ ఇచ్చారు. పనుల పూర్తిలో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మెడికల్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో పి. మధుసూదన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ








### ఇంటిగ్రల్ ఫౌండేషన్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల ఆటపాటలు.. పూల పండుగతో పాఠశాలలో పండుగ శోభ

హనుమకొండ టౌన్ మెట్రో న్యూస్ అక్టోబర్ 09తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఇంటిగ్రల్ ఫౌండేషన్ స్కూల్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. దసరా, బతుకమ్మ పండుగ సెలవులకు ముందు నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థినులు, ఉపాధ్యాయుల సందడి మధ్య అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి పాఠశాల ప్రాంగణాన్ని పూలవనంగా మార్చారు. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థినులు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ సంప్రదాయ పాటలు పాడి ఆటపాటలతో సందడి చేశారు. దీంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.విద్యార్థుల్లో సాంస్కృతిక విలువల పెంపునకు ప్రాధాన్యంతెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై నేటి తరం విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేయడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపాల్ సుమయ్య నాజ్నీన్ తెలిపారు. పండుగల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాల పట్ల గౌరవం, అభిమానం పెరుగుతాయని పేర్కొన్నారు.పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల సమన్వయంతో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

## ఆత్మ ఆధ్వర్యంలో నానో యూరియా ‘ నానో డీఏపీ పై క్షేత్ర ప్రదర్శన

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆత్మ డైరెక్టర్ విజయనిర్మల






ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో చీఫ్ మెట్రో ఈవినింగ్ న్యూస్ అక్టోబర్ (9) వరంగల్ జిల్లా పరిధిలో పైడిపల్లి రెవెన్యూ గ్రామంలో ద్రవరూప నానో యూరియా నానో డీఏపీ పై క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల పాల్గొని తగు సూచనలు సలహాలు రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అగ్రికల్చర్ ఆఫీసర్ నేలకుర్తి రవీందర్ రెడ్డి రైతులు ఉద్దేశించి మాట్లాడుతూ నానో యూరియా నానో డిఏపి వల్ల కలిగే ప్రయోజనాలను క్షుణ్ణంగా రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎరువుల వినియోగం 30 - 40 % మాత్రమే ఉండగా నానో ఎరువుల వినియోగ సామర్థ్యం 80-90% ఉంటుందని నానో యూరియా 500 ఎంఎల్ 45 కిలోల యూరియా బస్తా తో సమానమని దీనిని ఆకులపై పిచికారి చేయడం వల్ల నత్రజని వృధా కాకుండా నేరుగా మొక్కలకు లభిస్తుంది అలాగే 500 ఎం ఎల్, డి ఏ పి బాటిల్ 50 కిలోల డిఏపి బస్తాతో సమానమని ఇది వేళ్ళ వ్యవస్థను బలపరచడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది వివరించారు, ఈ క్షేత్ర ప్రదర్శనతో పాటు కపాస్ కాంతి లో భాగంగా వేసినటువంటి అధిక సాంద్రత పద్ధతిలో వేసిన ప్రతి పంటను నూతనంగా వేసినటువంటి సోయాబీన్ పంటలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రవళిక తో పాటు రైతులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు,

## పద్మాక్షి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

### ఈ నెల 11 నుంచి 22 వరకు వివిధ అలంకరణల్లో అమ్మవారి దర్శనం




హనుమకొండ టౌన్ మెట్రో న్యూస్ అక్టోబర్ 09 హనుమకొండలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికను శుక్రవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు.ఆదివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నీలిమ దంపతులు, కుడా చైర్మన్ గుండు సుధారాణి, ప్రభాకర్ తదితరుల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, చండీ సప్తశతి పారాయణం, హవనాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఈ నెల 21న రథోత్సవం, 22న ఉదయం పద్మాక్షి అమ్మవారి శాంతి కల్యాణం, సాయంత్రం పద్మాక్షి తటాకంలో తెప్పోత్సవం నిర్వహించనున్నారు. బ్రహ్మశ్రీ నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి.

ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కార్యకర్తలు నీలారపు రాజ్‌కుమార్, మునుగోటి రమేష్, ప్రచార కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, గోవర్ధన వెంకటరమణాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా కమిటీ ప్రతినిధుల మర్యాదపూర్వక భేటీ



మెట్రో న్యూస్ అక్టోబర్ 10 నర్సంపేట ఇటీవల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా కమిటీకి నూతనంగా ఎన్నికైన వైస్ చైర్మన్ శానబోయిన రాజ్ కుమార్,స్టేట్ ఎంసీ మెంబర్ నాడెం శాంతి కుమార్, జిల్లా ఎంసీ సభ్యులు మోతె తిరుపతిరెడ్డి, చొప్పరి సోమయ్య ఈరోజు హైదరాబాద్‌లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ గారిని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ప్రజాసేవే లక్ష్యంగా...ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ -- వరంగల్ జిల్లా కమిటీ సేవ చేస్తామని పేర్కొన్నారు

# మెట్రో

10

హైదరాబాద్ ,
శనివారం
అక్టోబర్ 10 , 2026


# జి.ఓ. 59 దరఖాస్తుదారులకు శుభవార్త



**- 500 చదరపు గజాలలోపు దరఖాస్తులకు పరిష్కారం**

**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** 22ఎ సమస్యలను పరిష్కారిస్తామని రాష్ట్ర శాసన సభలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ఈరోజు మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుతో కలుపుకుంటే ఆరు ఉత్తర్వులను ఇవ్వడం జరిగిందని.. తాజాగా జి.ఓ. ఎంఎస్. నెం.59 కింద 500 చదరపు గజాలు, అంతకంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. దరఖాస్తుల పరిశీలనలో ఏమైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

జీవో 59 పరిధిలోని ఆస్తుల విషయంలో అసలు భూమి రికార్డులు, లబ్దిదారుల అర్హత, క్రమబద్ధీకరించాల్సిన విస్తీర్ణం తదితర అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి చిన్న పొరపాటుకు కూడా తావు లేకుండా నిర్ణయం తీసుకోవాలని మంత్రి సూచించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. గత ప్రభుత్వంలో 59 జీవోను అనుసరించి కొన్ని అక్రమాలు జరిగాయని తమ దృష్టికి రావడంతో జీవో అమలును నిలిపివేయడం జరిగిందని అలాంటి తప్పులు పునరావృతం కాకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. న్యాయస్థానాల పరిధిలో ఉన్న దరఖాస్తులు, వివాదాస్పద అంశాల విషయంలో సంబంధిత కోర్టులు ఇచ్చే ఆదేశాలకు లోబడి మాత్రమే తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు.

## ప్రజాస్వామ్యానికి హృదయ స్పందనే సమాచార హక్కు చట్టం

**- రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా**



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** సమాచార హక్కు చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, అది మన ప్రజాస్వామ్యానికి హృదయ స్పందన వంటిదని, పారదర్శకత, జవాబుదారీతనం, పాలనలో ప్రజల భాగస్వామ్యానికి బలమైన పునాది అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ఈనెల 5 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు వారోత్సవాలలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ సమాచార కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వినయ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా, రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, వైష్ణవి మెర్ల, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ శాఖలకు చెందిన ప్రజా సమాచార అధికారులు, ప్రథమ అప్పీళ్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టి జి టి బి సి ఎల్‌కు బిగ్ రిలీఫ్

**- రూ.226 కోట్ల ఐటీ బకాయిల కేసులో అనుకూలంగా హైకోర్టు తీర్పు**



**హైదరాబాద్ : మెట్రోన్యూస్ :** తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ కు ఇన్ కమ్ టాక్స్ కేసులో బిగ్ రిలీఫ్ లభించింది. ఆదాయపన్ను శాఖ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు, కార్పొరేషన్‌కు అనుకూలంగా కీలక తీర్పు వెలువరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2007 నాటి ఆరు సంవత్సరాలకు సంబంధించిన ఇన్ కామ్ టాక్స్ పన్నుల కింద రూ. 544 కోట్లను బేవరేజెస్ కార్పొరేషన్ చెల్లించాలని ఐటీ డిపార్ట్‌మెంట్ కోర్టును ఆశ్రయించింది. ఈ మొత్తం రూ. 544 కోట్లలో ఉమ్మడి రాష్ట్ర విభాగానికి సంబంధించి తెలంగాణ టీజీబీసీఎల్ వాటాగా రూ. 226 కోట్లు చెల్లించాలని ఐటీ శాఖ తన పిటిషన్‌లో పేర్కొంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులో కార్పొరేషన్‌కు అనుకూలంగా తీర్పు రావడంతో తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ వర్గాలు తీవ్ర హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా కేసును సమర్థవంతంగా వాదించిన అడ్వకేట్ జనరల్ ఏ. సుదర్శన్ రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

# 'గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్'గా హైదరాబాద్

**- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల గమ్యస్థానంగానే కాకుండా... హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే 'గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్'గా తీర్చిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గ్లోబల్ మార్కెట్ అవసరాలు, సవాళ్లు, భవిష్యత్ సాంకేతిక మార్పులకు అనుగుణంగా దిగ్గజ కంపెనీలను ఆకర్షించే కాంప్రహెన్సివ్ ఎకో సిస్టంను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలో 30వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన నెదర్లాండ్స్ గ్లోబల్ ఫిన్‌టెక్ దిగ్గజం 'బ్యాక్‌బేస్' డెవలప్ మెంట్ సెంటర్‌ను శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే టెక్నాలజీ, డిజిటల్ బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో హైదరాబాద్ ను గ్లోబల్ కంపెనీలకు ఒక ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దామన్నారు. బ్యాక్‌బేస్ లాంటి దిగ్గజ కంపెనీల విస్తరణే ఇందుకు నిదర్శనమన్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించడం, పెద్ద కంపెనీలను రప్పించడమే కాకుండా... డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్ వేర్ ఇంజినీరింగ్ అండ్ ప్రొడక్ట్ డెవలప్ మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి రంగాల్లో ఉపాధి అవకాశాలను దక్కించుకునేలా తెలంగాణ యువతను సంసిద్ధం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. గ్లోబల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో అడ్వాన్స్ డిజిటల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ను అందుబాటులోకి తెచ్చేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు.

ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు చూపే సత్తా టెక్నాలజీకి ఉందని, ఆ దిశగా కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు నెక్స్ట్ జనరేషన్ డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్ వేర్ ఉత్పత్తులను అందించడంలో ఈ బ్యాక్‌బేస్ డెవలప్‌మెంట్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇక్కడ కొత్తగా 300 మంది హై-స్కిల్డ్ వర్క్ ఫోర్స్ కు ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

# హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సు

**- ఏర్పాట్లపై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష**

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు హైటెక్స్‌లో నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ జాతీయ సదస్సు ఏర్పాట్లపై శుక్రవారం సెక్రటేరియట్లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌ను హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో నిర్వహించబోయే "ఇన్వెస్ట్ తెలంగాణ" సదస్సులో పెట్టుబడులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మంత్రులు, కార్యదర్శులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇంజనీర్లు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి రహదారుల నిపుణులు, విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులు కలిపి సుమారు 3,000 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని మంత్రి తెలిపారు. హైటెక్స్‌లో సుమారు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లను



ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా రహదారుల నిర్మాణం, ఆధునిక సాంకేతికత, భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, నిపుణులు ఒకే వేదికపై సమావేశం కావడం వల్ల తెలంగాణకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించడంతో పాటు పెట్టుబడులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ

**- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**

**హైదరాబాద్ : మెట్రో న్యూస్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల కు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా



ఆయన తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడు చుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మన అను బంధానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ను రాష్ట్ర ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పూల పరిమళం, మహిళల ఐక్యతకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ నేలపై వికసించే వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మగా పేర్చి, ఆడపడుచులు సామూహికంగా ఆడుతూ పాడుతూ జరుపుకునే ఈ పండుగ మన ప్రత్యేక సాంస్కృతిక వారసత్వానికి ప్రతిబింబమన్నారు. బతుకమ్మ వేడుకలు ప్రతి ఇంటా సంతోషాన్ని, సౌభాగ్యాన్ని, ఆరోగ్యాన్ని నింపాలని, తెలంగాణ ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు వెల్లివిరియాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

మహిళల సంక్షేమం, ఆత్మగౌరవం, సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ వాటి వైభవాన్ని ప్రపంచానికి చాటేలా ప్రతి ఒక్కరూ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆడపడుచులందరికీ, రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని కోరారు.

## గల్ఫ్ కార్మికులకు క్షమాపణ చెప్పిన తర్వాతే దుబాయిలో అడుగుపెట్టాలి

**- టీపీసీసీ ఎన్నారై సెల్ నాయకుల డిమాండ్**




**హైదరాబాద్ : మెట్రో న్యూస్ :** గల్ఫ్ కార్మికుల సంక్షేమా నికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బీఆర్ఎస్ పార్టీ వారిని మోసం చేసిందని టీపీసీసీ ఎన్నారై సెల్ నాయకులు విమర్శిం చారు. దుబాయిలో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాలకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయ కులు ముందుగా గల్ఫ్ కార్మికులకు క్షమాపణ చెప్పిన తర్వాతే దుబాయిలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం గాంధీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో టీపీసీసీ ఎన్నారై సెల్ ఛైర్మన్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సుమారు రెండు వేల మంది గల్ఫ్ కార్మికులు మరణించారని, వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా ఆ కుటుంబాలను మోసం చేసిందని అన్నారు. రాష్ట్ర సాధన కోసం కష్టపడ్డ గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు.

# స్పీకర్ బృందం యూరప్ స్టడీ టూర్ విజయవంతం

**- సభాపతికి నేతలు, అభిమానుల ఘన స్వాగతం**

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ యూరప్ పర్యటన విజయవంతంగా ముగించుకొని హైదరాబాద్‌కు తిరిగి చేరుకున్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఆధ్వర్యంలో చేపట్టిన స్టడీ టూర్ ను విజయవంతంగా ముగించుకుని శుక్రవారం ఉదయం శంషాబాద్ ఇంటర్నే షనల్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న స్పీకర్ ప్రసాద్ కుమార్ కు వికారాబాద్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఘన స్వాగతం పలికారు. యూరప్ పర్యటనలో భాగంగా జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జ ర్లాండ్ దేశాల్లో పలు అధ్యయన కార్యక్రమాల్లో స్పీకర్ బృందం పాల్గొంది. స్టడీ టూర్లో భాగంగా ఆయా దేశాల పార్లమెంటరీ వ్యవస్థలు, శాసనసభల పనితీరు, ప్రజా స్వామ్య ప్రక్రియలు, చట్టాల రూపకల్పన విధానాలు, శాసనసభల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, చట్టాల రూపకల్పన విధానాలు, ప్రజాప్రతినిధుల బాధ్యతలు వంటి అనేక కీలక అంశాలపై స్పీకర్ బృందం అధ్యయనం చేసింది.

తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి



స్పీకర్ బృందం యూరప్ పర్యటనలో విదేశీ ప్రతినిధులకు, పెట్టుబడిదారులకు వివరించింది. ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధి, తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అందిస్తున్న సహాయ, సహకారాలు, భద్రత, పారదర్శక విధానాల గురించి వివరించి, వారిలో భరోసా కల్పించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా చేపట్టిన యూరప్ పర్యటన విజయవంతమైందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. స్పీకర్‌తో పాటు తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి, శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు కూడా విదేశీ పర్యటన పూర్తి చేసుకుని, హైదరాబాద్‌కు చేరుకున్నారు.

# పనిగట్టుకొని తప్పుడు ప్రచారం

**- శివసేన తెలంగాణ అధ్యక్షులు శివాజీ**

**హైదరాబాద్ : మెట్రో న్యూస్ :** నరేంద్ర మోడీ 25 సంవత్సరాల రాజకీయ నేపథ్యంలో ముఖ్యమంత్రి నుంచి ప్రధానమంత్రి వరకు నిరంతరంగా కొనసాగుతున్న సందర్భంగా శివసేన పార్టీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు సంబంధించి పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సుంకారి శివాజీ తెలిపారు దేవుళ్లను అవమానించారని అంటూ కొంతమంది చేస్తున్న పని గట్టుకుని చేస్తున్న ప్రచారంపైన ఆయన స్పందించారు దేశం కోసం శ్వాసను వదిలేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని సనాతన ధర్మం పైన జరుగుతున్న దాడిని గత 18 ఏళ్ల నుంచి అడ్డుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నానని తెలిపారు .విమర్శించడానికి ముందుకు వచ్చిన సెక్యులర్ హిందువులు సనాతన ధర్మం పైన జరుగుతున్న దాడిని అడ్డుకోండి దేవుళ్ళ పైన జరుగుతున్న అరాచక శక్తుల వక్రబుద్ధిని నాశనం చేయండని సూచించారు. భారత ప్రధాని ప్రపంచ నాయకుడు నరేంద్ర మోదీ భారతదేశాన్ని ఎల్లప్పుడు కంటికి రెప్పలా కాపాడుతూ. ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని



అగ్ర దేశంగా నిలిపేందుకు 24 గంటలు కష్ట పడుతున్నారని ఆయన తెలిపారు. విపక్షాలు ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఎదుర్కొంటూ దేశానికి సేవ చేస్తున్నారని అభివృద్ధిని విపక్షాలు అడ్డుకుంటున్నప్పటికీ ఏ మాత్రం లెక్కచేయ్యకుండా ముందుకు వెళ్తునారని అన్నారు ప్రపంచ దేశాల్లో భారతదేశానికి ఉన్నటువంటి గౌరవం అది మోదీ వల్లనే దక్కిందని ఆయన వివరించారు

శ్రీ రాముడు రూపంలో నరేంద్ర మోదీ కనిపించాడని

రామాయణంలో రాముడికి అండగా నిలబడిన లక్ష్మణుడు రూపంలో

అమిత్ షా కనిపించాడన్నారు

రామ లక్ష్మణులకు తోడుగా ఉన్న హనుమాన్ రూపంలో... ఏక్ నాథ్ షిండే ల కనిపించాడని తాను ఎక్కడ కూడా మోదీ, అమిత్ షా, ఏక్ నాథ్ షిండే లను దేవుళ్ళు అని చెప్పలేదని దేవుళ్ళతో పోల్చలేదన్నారు

దేశాభివృద్ధికి అంకితమై నిరంతరంగా పనిచేస్తున్న వారికి నేను ఇచ్చిన స్థానమన్నారు. కష్టం వచ్చినప్పుడు ఎవరైనా సహాయం చేస్తే... వారిని దేవుడు సహాయం చేసాడని అని అనుకుంటామని అదే తరహాలో నా దృష్టిలో దేశాన్ని రక్షిస్తున్న వారిని తాను ఈ విధంగా చూసినట్టు తెలిపారు. గురు బ్రహ్మ గురు విష్ణు గురు దేవో మహేశ్వరః, గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః అని ఆయన ఉదాహరించారు గురువు దైవంతో సమానమని తనకు మోదీ, అమిత్ షా, ఏక్ నాథ్ షిండే... గురువులా కనిపించారని తెలిపారు విమర్శించడం ఆపివేసి అధర్మం పైన యుద్ధం చేయండని శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు.

మెట్రో ఈవినింగ్స్ సినిమా

## పుష్ప, పాధగట్టం



ఒకప్పుడు టాలీవుడ్ సినిమాల్లో ఇండస్ట్రీ హిట్స్ పై స్పూఫ్ లు చేసి కామెడీ పండించే ట్రెండ్ ఎక్కువగా ఉండేది. ముఖ్యంగా అల్లరి నరేష్ ఆ రూట్లో హిట్టు కొట్టిన సందర్భాలు ఎక్కువే. అయితే కాలానుగుణంగా ఆ ఫార్ములాను పక్కనపెట్టేశారు. కానీ ఇప్పుడు ఆ స్పేస్ ను శ్రీ విష్ణు వాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. తన సినిమాల్లో బలవంతంగా స్పూఫ్ సీన్స్ ఇరికించకుండా, సిచువేషన్ కు తగ్గట్లుగా పాపులర్ డైలాగ్స్ తో సెటైర్లు వేస్తూ కొత్త తరహా కామెడీని పరిచయం చేసే దిశగా అడుగులు వేస్తున్నాడు. గురూజీ.. ఇంకాస్త ఎక్కువ చేస్తే తప్పేంటి! లేటెస్ట్ గా కామ్రేడ్ కళ్యాణ్ సినిమాలో కూడా మేకర్స్ ఇదే ఫార్ములాను నమ్ముకున్నట్లు తెలుస్తోంది. శ్రీ విష్ణు తన మీద తానే వేసుకునే సెల్ఫ్ పంచ్ లతో పాటు ఇండస్ట్రీపై వేసిన సెటైర్లను ఇందులో గట్టిగానే వాడుకున్నారు.

## ఇరుముడి ఎఫెక్ట్



కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న మాస్ మహారాజా రవితేజకు రీసెంట్ గా వచ్చిన ఇరుముడి మూవీతో మంచి ఊపు వచ్చినట్టే కనిపిస్తోంది. బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన ఆ సినిమాలో మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఆడియన్స్ పై స్ట్రాంగ్ ఎఫెక్ట్ చూపించాయని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. దీంతో తన నెక్స్ట్ మూవీ విషయంలో రవితేజ ఆ విషయంలో మరింత జాగ్రత్తగా తీసుకుంటున్నట్లు ఇప్పుడు టాక్ వినిపిస్తోంది.

## శృతి హాసన్.. పర్సనల్ ఫ్రీడమ్ కు లిమిట్స్ ఎక్కడ?



హీరోయిన్లు తమ పర్సన్ లైఫ్ పై మాట్లాడటం కొత్తేమీ కాదు. కానీ కొన్ని విషయాలపై ఓపెన్ గా మాట్లాడితే మాత్రం వెంటనే డిబేట్ స్టార్ట్ అవుతుంది. ఇప్పుడు స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్ చేసిన కామెంట్స్ కూడా అలాంటి చర్చనే మొదలుపెట్టాయి. అయితే ఆమె చేసిన కామెంట్స్ కంటే.. దాని వెనుక ఉన్న ఆలోచన ఏంటనేదే అసలు అబ్జర్వ్ చేయాల్సిన విషయం. శ్రుతి హాసన్ రీసెంట్ గా సెల్ఫ్ కేర్, పర్సనల్ ఫ్రీడమ్ వంటి విషయాలపై మాట్లాడారు. ఆ సమయంలో సె×క్స్ టాయ్స్ ను కూడా సెల్ఫ్ కేర్ లో భాగంగా చూడొచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ఆ విషయంలో ఇతరుల పర్మిషన్ అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత నిర్ణయాలను తామే తీసుకునే ఫ్రీడమ్ ఉండాలని చెప్పారు. ఇక్కడ శ్రుతి చెప్పిన అసలు పాయింట్ ఒక వస్తువు గురించి మాత్రమే కాదు. చాశ్రీంశీ =ఘుం – పుష్ప, పాధగట్టం.. ఆ స్పేస్ ను వాడుకుంటున్న శ్రీవిష్ణు మన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన నిర్ణయాలపై సొసైటీ ఎంతవరకు ఎఫెక్ట్ చూపించాలనేదే ఆమె కామెంట్స్ లో కనిపిస్తున్న మెయిన్ ఎలిమెంట్. ముఖ్యంగా పర్సనల్ లైక్స్, రిలేషన్స్, బాడీ, ప్రైవసీ వంటి విషయాల్లో ఇతరులు చేసే జడ్జ్మెంట్లకు భయపడకుండా.. తమకు ఏది కంఫర్ట్ గా ఉంటుందో దానిని వ్యక్తులు నిర్ణయించుకోవాలన్నది ఆమె అభిప్రాయంగా కనిపిస్తోంది. అయితే మన సొసైటీలో ఇలాంటి విషయాలు ఇప్పటికీ కామన్ గా మారలేదు. అందుకే శ్రుతి కామెంట్స్ బయటకు వచ్చిన వెంటనే ఆమె చెప్పిన విషయం కంటే.. ఆమె ఎందుకు ఇలా మాట్లాడారనే యాంగిల్ లో ఎక్కువగా చర్చ జరుగుతోంది.

## ప్రభాస్ బర్త్‌డే గిఫ్ట్ అంత స్పెషల్‌గా ఉండబోతోందా?



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు అక్టోబర్ 23 దగ్గరకు వస్తున్న కొద్దీ అతడి అభిమానుల్లో ఉత్సాహం తారాస్థాయికి చేరుకుంటోంది. ప్రతి ఏటా డార్లింగ్ బర్త్‌డేను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకునే ఫ్యాన్స్ ఈసారి మాత్రం దాన్ని మరో లెవెల్‌కి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. వరుస పాన్ ఇండియా విజయాలతో దూసుకుపోతున్న ప్రభాస్ తాజా సినిమాల అప్‌డేట్స్ కోసం అభిమానులు, సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా ఈ బర్త్‌డే వేడుకలకు సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న రకరకాల చర్చలు, పుట్టుకొస్తున్న రూమర్స్ టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇంత బిజీలో కూడా చిన్న సినిమాను మోస్తున్న తమన్!

ఇక ఈ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడిక్ వార్ డ్రామా ఫౌజీ గురించిన ఆసక్తికర విషయాలు చక్కర్లు కొడుతున్నాయి. అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఒక ప్రత్యేకమైన టీజర్ లేదా అదిరిపోయే కొత్త లుక్‌ను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## రణబాలికి ఆ రెండు హంగామాలు లేవు!



సినిమా రిలీజ్ అనగానే టికెట్ రేట్ల పెంపు, పెయిడ్ ప్రీమియర్స్ అనేవి చాలా కామన్ అయిపోయాయి. ఈ రెండు హంగామాలతోనే సగం క్రేజ్ తెచ్చుకోవాలని మేకర్స్ చూస్తున్నారు. కానీ విజయ్ దేవరకొండ నటిస్తున్న రణబలి టీమ్ మాత్రం ఈ రెగ్యులర్ ట్రెండ్ కు పూర్తిగా భిన్నమైన దారిలో వెళ్తోంది. ట్రైలర్ లాంచ్ లో మైత్రీ నిర్మాతలు తీసుకున్న నిర్ణయాలు ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తున్నాయి.



## టీమిండియా – వెస్టిండీస్

టీమిండియా– వెస్టిండీస్ మధ్య నాలుగో టీ20 మ్యాచ్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తోంది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో బుధవారం (అక్టోబరు 14) ఈ మ్యాచ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి జీవన్ రెడ్డి టికెట్ల వివరాలను వెల్లడించారు.

కనీస టికెట్ ధర రూ. 750 "భారత్– విండీస్ మ్యాచ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. కనీస టికెట్ ధర 750 రూపాయలు పెట్టాం. అత్యధిక టికెట్ ధర 20 వేలు. ఎజూ మొదటి సారి పాఠశాల విద్యార్థులకు 2500 టికెట్స్, భారత ఆర్మీకి 250 ఉచిత టికెట్లు ఇస్తున్నాం. పార్కింగ్, ట్రాఫిక్ జామ్ నేపథ్యంలో మెట్రో రైలులో వచ్చి మ్యాచ్ చూడండి. శుక్రవారం సాయంత్రం మరిన్ని.. రిలీజ్ మ్యాచ్ ఆరంభానికి రెండు గంటల ముందు స్టేడియానికి చేరుకోవాలి. మొత్తం 34 వేల టికెట్లు ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టాము. యాప్‌లో ఒకేసారి నాలుగు టికెట్లు కొనుగోలు చేయవచ్చు. ఇప్పటి వరకు 12 వేల టికెట్లు అమ్ముడు పోయాయి. మళ్ళీ శుక్రవారం సాయంత్రం 12 వేల టికెట్లు ఆన్‌లైన్‌లో పెడతాం. చివరి 48 గంటల్లో 10 వేల టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెస్తాము. టికెట్లకు బాగా డిమాండ్ ఉంది. అందుకే బ్లాక్‌లో అమ్మకాలు కాకుండా ఆన్‌లైన్‌లోనే పెట్టాము" అని జీవన్ రెడ్డి తెలిపారు.

## భారత్‌తో టీ20 సిరీస్‌కు ముందు న్యూజిలాండ్‌కు షాక్



భారత్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ముందు న్యూజిలాండ్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. గాయాల కారణంగా కీలక ఆటగాళ్లు మార్క్ చాప్మాన్, జాక్ ఫోక్స్ ఈ సిరీస్‌కు దూరమయ్యారు. అక్టోబర్ 22 నుంచి భారత్–న్యూజిలాండ్ టీ20 సిరీస్ ప్రారంభం కానుంది.

గాయాలతో ఇద్దరు ఆటగాళ్లు ఔట్

గత నెలలో జరిగిన యూరోపియన్ టీ20 లీగ్‌లో మార్క్ చాప్మాన్ గాయపడ్డాడు. దీంతో భారత్‌తో జరగనున్న సిరీస్‌లో అతడు ఆడటం లేదు. మరోవైపు, జాక్ ఫోక్స్ ఎప్పుడు జట్టుతో తిరిగి చేరతాడనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. చాప్మాన్, ఫోక్స్ స్థానాల్లో జోష్ క్లార్క్‌సన్, బ్లెయిర్ టిక్నర్‌లను న్యూజిలాండ్ జట్టు ఎంపిక చేసింది. కీలక ఆటగాళ్లు దూరం కావడం జట్టుకు నష్టమేనని కోచ్ రాబ్ వాల్టర్ పేర్కొన్నారు. భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ అక్టోబర్ 22 నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కు ముందు గాయాల సమస్య న్యూజిలాండ్ జట్టు కూర్పుపై ప్రభావం చూపనుంది.

## మెట్రో స్పోర్ట్స్

## పీఎస్ఎల్ 12వ ఎడిషన్ షెడ్యూల్ విడుదల




పాకిస్థాన్ సూపర్ లీగ్ (ఊూ) 12వ ఎడిషన్ షెడ్యూల్ అధికారికంగా ఖరారైంది. వచ్చే ఏడాది మార్చి 18 నుంచి మే 2 వరకు ఈ మెగా క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా మొత్తం 8 జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. లండన్‌లో సెప్టెంబర్ 1న జరిగిన పీఎస్ఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఈ తేదీలను ఆమోదించారు. ఈ భేటీకి 8 ఫ్రాంచైజీల యజమానులు, ప్రతినిధులు హాజరయ్యారు.

పీఎస్ఎల్ 11వ సీజన్‌లోనే 8 జట్ల ఫార్మాట్‌ను తొలిసారిగా ప్రవేశపెట్టారు. అలాగే సాంప్రదాయ డ్రాఫ్ట్ విధానానికి స్వస్తి చెప్పి, కొత్తగా ఆటగాళ్ల వేలం పద్ధతిని ప్రవేశపెట్టారు. మే నెలలో లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరిగిన పీఎస్ఎల్ 11 ఫైనల్‌లో హైదరాబాద్ కింగ్స్‌మెన్‌ను ఓడించి, పెషావర్ జల్మీ తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ టైటిల్ గెలుచుకుంది. ఈ హోరాహోరీ ఫైనల్ మ్యాచ్‌కు స్టేడియంలో 32,461 మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తాజా షెడ్యూల్ ప్రకటనపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోహసిన్ నక్వీ సంతోషం వ్యక్తం చేశారు. "పీఎస్ఎల్ 11 ఈ లీగ్ సత్తా ఏంటో ప్రపంచానికి నిరూపించింది. రికార్డు స్థాయిలో ప్రేక్షకులు, ప్రసారాలతో దేశవ్యాప్తంగా అద్భుతమైన ఉత్కంఠను రేపింది. రాబోయే పీఎస్ఎల్ 12వ సీజన్ ఆ స్థాయిని మరింత పెంచుతుందని నమ్ముతున్నాం. అభిమానులకు మరో అద్భుతమైన క్రికెట్ సీజన్‌ను అందిస్తాం" అని పేర్కొన్నారు. ఐపీఎల్‌తో మళ్లీ క్లాష్ అయ్యే అవకాశం? ఈ కొత్త షెడ్యూల్ ప్రకటనతో ఆటగాళ్ల రిటెన్షన్, ట్రేడ్ విండో, ప్లేయర్ల వేలం వంటి కీలక ప్రక్రియలకు మార్గం సుగమమైంది. అయితే, పీఎస్ఎల్ మార్చి నుండి మే వరకు జరగనుండటంతో ఈ తేదీలు మరోసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్ షెడ్యూల్‌తో క్లాష్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ టోర్నమెంట్‌లో హైదరాబాద్ కింగ్స్‌మెన్, ఇస్లామాబాద్ యునైటెడ్, కరాచీ కింగ్స్, లాహోర్ ఖలందర్స్, ముల్తాన్ సుల్తాన్స్, పెషావర్ జల్మీ, క్వెట్టా గ్లాడియేటర్స్ మరియు రావల్పిండి జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి.

## ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలోనే తొలిసారి



ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు.. దక్షిణాఫ్రికా గడ్డ మీద తొలిసారి టెస్టు సిరీస్‌కు సిద్ధమైంది. ఇరుజట్ల మధ్య దర్బన్‌లోని కింగ్స్‌మేడ్ మైదానంలో శుక్రవారం తొలి టెస్టు మొదలైంది. టాస్ గెలిచిన పర్యాటక ఆసీస్ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అరుదైన ఫీట్ ఇదిలా ఉంటే.. సౌతాఫ్రికాతో తొలి టెస్టు సందర్భంగా ఆస్ట్రేలియా అరుదైన ఫీట్ నమోదు చేసింది. తమ క్రికెట్ చరిత్రలోనే తొలిసారిగా ఓ టెస్టు మ్యాచ్‌లో.. తుదిజట్టు మొత్తంలో ముప్పై ఏళ్లకు పైబడిన ఆటగాళ్లకు చోటు ఇచ్చింది. ఓవరాల్‌గా క్రికెట్ చరిత్రలో టెస్టు ప్లేయింగ్ ఎలెవన్‌లో ఇలా అందరూ వెటరన్ ఆటగాళ్లు ఉండటం ఇది ఐదోసారి. మొట్టమొదటి సారిగా 1921లో ఆస్ట్రేలియాతో టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్ తమ తుదిజట్టులో 30 ప్లస్ ఏజ్ ఆటగాళ్లను బరిలోకి దించింది.

మెట్రో ఈవినింగ్స్

హైదరాబాద్,
శనివారం,అక్టోబర్ 10, 2026



BREAKING EDITION

# నిఘా నీడలో హస్తిన

## సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

### ఎంపీ మల్లు రవి

ఢిల్లీ (మెట్రోన్యూస్): సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. ఈసీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఇండియా కూటమి ఎంపీలపై కేంద్రం పోలీసుల ద్వారా రాజ్యం ఏలుతోందని విమర్శించారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై పోలీసులతో భౌతిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు.




ఢిల్లీ (మెట్రోన్యూస్): కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. ఢిల్లీ నగరంలో హైఅలర్ట్ ప్రకటించింది. నగరవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేసింది. అందుకోసం భారీగా పోలీసులు, భద్రతా బలగాలను మోహరించింది.దేశంలోని వివిధ రా(ష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ నుంచి దాదాపు 7 వేల మంది సీఆర్పీఎఫ్ సిబ్బందిని ఇప్పటికే ఢిల్లీకి తరలించారు. ఢిల్లీ వ్యాప్తంగా 20 వేలకు పైగా పోలీసు, పారా మిలటరీ బలగాలతో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఏమైనా అల్లర్ల జరిగితే.. గుంపులను చెదరగొట్టేందుకు యాంటీ రైట్ ఆయుధాలతో బలగాలు రంగంలోకి దింపారు.

మరో వైపు ఢిల్లీలోని భద్రతా పరిస్థితిని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అందుకోసం వివిధ రా(ష్ట్రాల పర్యటనను ఆయన రద్దు చేసుకున్నారు. శనివారం సీజేపీ ఆందోళన నేపథ్యంలో ఢిల్లీలో పరిస్థితిపై అత్యున్నత స్థాయి అధికారులతో ఆయన ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ చేపట్టనున్న నిరసనకు అనుమతిని ఇప్పటికే ఢిల్లీ పోలీసులు నిరాకరించారు. ఆందోళనకు అనుమతి లేదని సీజేపీకి ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉందని తెలిపారు.ఇంకో వైపు సోషల్ మీడియాపై నిఘా పెట్టారు. నిరసనల పేరుతో ఉద్రిక్తతలు సృష్టించే తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఢిల్లీ పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. ఇక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఢిల్లీ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు, భద్రతా సిబ్బంది ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఢిల్లీ సరిహద్దుగా ఉన్న రా(ష్ట్రాలు నిఘా నీడలో వెళ్లాయి.శనివారం సీజేపీ నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు డీసీపీ సృష్టి పాండే సూచించారు. విధులకు వెళ్లే వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ఈ నిరసనల్లో పాల్గొన వద్దని ప్రజలకు తెలిపారు. మీ భద్రతతోపాటు కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు తెలిపారు. శుక్ర, శనివారాల్లో ఢిల్లీ నగరంలో మద్యం దుకాణాలు మూసి వేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్న అమిత్ షా

### 10న నిరసన నేపథ్యంలో.. 57 మెట్రో స్టేషన్లు మూసివేత !

## ఛత్తీస్‌గఢ్‌లో పేలిన మందుపాతర..

### నలుగురు జవాన్లకు తీవ్ర గాయాలు

ఇంటర్నెట్ డెస్క్: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మందుపాతర పేలుడు కలకలం రేపింది. మందుపాతరను నిర్వీర్యం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు పేలుడు సంభవించడంతో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ బృందానికి చెందిన నలుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని బొడ్రాజదర్ కల్వర్టు వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. మందుపాతరను గుర్తించిన అనంతరం దానిని నిర్వీర్యం చేసేందుకు వెళ్లిన బాంబు నిర్వీర్య బృందం సభ్యులు ఈ ప్రమాదానికి గురయ్యారు. పేలుడులో గాయపడిన జవాన్లను వెంటనే సుక్మా జిల్లా కుంట ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించినట్లు సమాచారం. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ప్రత్యేక చికిత్స అందించాల్సిన అవసరం ఉందని సమాచారం .

## 'సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి'

హైదరాబాద్ (మెట్రో న్యూస్): కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, స్వతంత్రతపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రజల్లో విశ్వసనీయతను కాపాడలేకపోతే కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యానికి వెన్నెముక.. అధికారంలో ఉన్నవాళ్లకు రక్షణ కవచం కాదు. ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయినప్పుడు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదు.. సీఈసీ పదవికి జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి. ఓటర్ల హక్కులను కాలరాస్తే కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమారే పూర్తి బాధ్యత వహించాలన్నారు.



దసరాకు టీజీఎస్ఆర్టీసీ 7 వేల ప్రత్యేక బస్సులు

## 40శాతం అదనపు ఛార్జీలు

హైదరాబాద్ (మెట్రోన్యూస్): దసరా పండుగ నేపథ్యంలో విద్యా సంస్థలకు సెలవులు రావడంతో ప్రజలు సొంతూళ్ల బాట పట్టారు. దీంతో నగరంలోని బస్టాండ్లలో భారీగా రద్దీ నెలకొంది. జేబీఎస్, ఎంజీబీఎస్ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. దసరాకు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నేటి(శుక్రవారం) నుంచి 7 వేల స్పెషల్ బస్సులను టీజీఎస్ఆర్టీసీ నడుపనుంది. ప్రత్యేక బస్సుల్లో 40 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేయనున్నారు. కరీంనగర్ జోన్ నుంచి 3,533 స్పెషల్ బస్సులు, హైదరాబాద్ జోన్ నుంచి 2,155 ప్రత్యేక బస్సులు, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. ఈనెల 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. తిరుగు ప్రయాణ రద్దీ దృష్ట్యా 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఎంజీబీఎస్, జేబీఎస్ సహా ప్రధాన ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రయాణికుల కోసం షెడ్స్, తాగునీరు, కుర్చీలు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన ప్రత్యేక బస్సుల్లో మాత్రమే 1.5 రెట్లు వరకు సవరించిన టికెట్ ధరలు ఉండనున్నాయి. ఇక, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం యథావిధిగా అమలులో ఉండనుంది.



## నీళ్లివ్వండయ్యా

## రైతుల ధర్నా

జనగామ (మెట్రోన్యూస్): యేనే చెరువును గోదావరి జలాలతో నింపాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డుపై పురుగుల మందు డబ్బాలతో బైఠాయించి ఆందోళన చేపట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. జనగామ - హుస్నాబాద్ ప్రధాన రహదారిపై జనగామ మండలంలోని వడ్లకొండ గ్రామం వద్ద రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా నీళ్లు లేక భూములు బీడుగా మారి పంటలు ఎండిపోతున్నాయని, అధికారులు స్పందించి నీళ్లు విడుదల చేయాలన్నారు.

రైతుల నిరసనతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు.

## మహబూబాబాద్‌లో ఏసీబీ సోదాలు

మహబూబాబాద్,(మెట్రోన్యూస్): మహబూబాబాద్ జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ మేనేజర్ నరసింహారావుకు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు ఫిర్యాదు అందడంతో కార్యాలయంలో అధికారులు సోదాలు చేపట్టారు. ఖమ్మంలోని ఆయన నివాసంతో పాటు సూర్యాపేట, హైదరాబాద్ సహా మొత్తం 7 ప్రాంతాల్లోని నరసింహారావు ఇళ్లు, బినామీల నివాసాల్లో సోదాలు చేస్తున్నారు. ఆయనకు భారీగా ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

## జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే



హైదరాబాద్ (మెట్రోన్యూస్): భారత రాజ్యాంగం కంటే గొప్పది ఏదీ లేదని, ఈ దేశంలో ఏ ఒక్క పౌరుడి ఓటు హక్కునూ లాక్కునే అధికారం ఎవరికి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. వ్యవస్థల కంటే వ్యక్తులు ఎన్నడూ గొప్పవారు కారని, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన బాధ్యతల నుంచి వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దేశంఎందరో వ్యక్తులను చూసింది, ఎందరో వచ్చారు.. పోయారు. వాటన్నింటినీ తట్టుకుని భారతదేశం ఎంతో బలంగా నిలబడింది. సగర్వంగా ముందుకు సాగుతోంది.




### ధర ఎక్కువగా ఉండటంతో కనిపించని ఆదరణ

హైదరాబాద్ (మెట్రోన్యూస్): మెట్రోతోపాటు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించే కామన్ పాస్ తీసుకురావాలని నగరవాసులు చాలా కాలంపాటు డిమాండ్ చేశారు. కానీ హైదరాద్ మెట్రో సంస్థ మొదటి నుంచి నెలవారీ పాస్ పట్ల సుముఖంగా లేదు. అయితే గాంధీ జయంతి సందర్భంగా ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌ను ప్రవేశపెట్టారు. నెలవారీ పాస్ ధర రూ.8500, డైలీ పాస్ ధర రూ.400గా నిర్ణయించారు. ఈ పాస్ ధర చాలా ఎక్కువగా ఉందంటూ ప్రయాణికులు, నగర వాసులు పెదవి విరిచారు. హైదరాబాద్ నగర వాసులు ఆర్టీసీ బస్సులతోపాటు మెట్రోలోనూ ప్రయాణించేలా ఆర్టీసీ, హైదరాబాద్ మెట్రో కలిసి 'ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్'ను అందుబాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ కామన్ పాస్‌లను ప్రారంభించారు. ఈ కార్డు కొనుగోలు చేసిన వారికి ఎయిర్‌పోర్టుకు వెళ్లే పుష్పక్ ఏసీ బస్సులు మినహా.. ఔటర్ రింగ్ రోడ్డు లోపల అన్ని రకాల ఆర్టీసీ బస్సులు, మెట్రోలో ప్రయాణించే వెసులుబాటు ఉంటుంది.

## ట్యాంక్ బండ్ పై బర్త్‌డేలు వద్దు - సజ్జనార్

హైదరాబాద్ (మెట్రోన్యూస్): హైదరాబాద్ నగరంలోని ట్యాంక్ బండ్ పై అర్ధరాత్రి వేడుకలు నిర్వహించడంపై పోలీసు శాఖ తీవ్రమైన ఆంక్షలు విధించింది. ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో చిన్నారితో సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ట్యాంక్ బండ్ పై అర్ధరాత్రి వేడుకలు జరపకూడదని అధికారులు స్పష్టం చేశారు.బహిరంగ ప్రదేశాల్లో కేక్ కటింగ్ లు చేయడం వల్ల ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అంతేకాకుండా నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రాణాల మీదికి వస్తోంది. సంతోషంగా గడపాల్సిన పుట్టినరోజు వేడుకలు కొన్ని కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయి. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిబంధనలు తెచ్చారు. నగరంలోని రోడ్లు, చెరువులు అలాగే పార్కుల వద్ద ఎటువంటి వేడుకలు చేయవద్దని న్ణ పోలీస్ కమిషనర్ సీవీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు . నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకొని ప్రాణాలను కాపాడుకోవాలని అధికారులు కోరారు.

Follow Us / @metroevenings.com

Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 89191 30975, 99126 14007